ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
5
బుధవారం, 14 మే 2025



ముత్యాలంపాడులో విద్యుత్ సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన చేసిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

భద్రాద్రి జిల్లాకు సీతారామ జలాలు

- ఆ మేరకు సర్వే జరిపిస్తున్నాం
- బయ్యారం పెద్దచెరువు, తులారం ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తాం
- రాజీవ్ యువ వికాసంతో యువతకు ఉపాధి
- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క
- బయ్యారం, టేకులపల్లి మండలాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

ఇల్లెందు, మే 13 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల్లోని సాగు భూములకు సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలు అందిస్తామని, ఆ మేరకు సర్వే జరిపిస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పేర్కొనారు. అదేవిధంగా బయ్యారం పెద్దచెరువు, తులారం ప్రాజెక్టులను సైతం అభివృద్ధి చేస్తామని ప్రకటించారు.

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మంగళవారం ఇల్లెందు నియోజవర్గంలోని బయ్యారం, టేకులపల్లి మండలాల్లో వివిధ అభివృద్ధి పథకాలకు శంకుస్థాపనలు చేశారు. టేకులపల్లి మండలం కోయగూడెం గ్రామంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు.

రాష్ట్రంలో నిరుద్యోగ యువతీ యువకులకు 57 వేల ఉద్యోగాలు కల్పించామని, ఇతర ఉద్యోగాల నియామకాలకు జాబ్ క్యాలెండర్‌ను రూపొందించి అమలు చేస్తున్నామని, ఉద్యోగాలు రాని యువత ఆర్థికంగా బలపడేందుకు ఆత్మగౌరవంతో జీవించడానికి రాజీవ్ యువవికాసం పథకం అమలు చేస్తున్నామన్నారు. మే 15 తేదీ వరకు జిల్లా స్థాయిలో యువతీ యువకుల ఎంపికలు పూర్తిచేసి, 28 వరకు మంజూరు పత్రాలు జారీ చేయడం జరుగుతుందని శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి తెలంగాణ ఆవిర్భావ దినం జూన్ 2 నుంచి 9 వరకు రాజీవ్ యువ వికాసం పథకం అమలుచేయడం జరుగుతుందని వెల్లడించారు. ప్రతిపైసా రాష్ట్ర అభివృద్ధి ప్రజాసంక్షేమం కోసం వినియోగిస్తామని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా ఏ రాష్ట్రంలో కూడా ఒకే సంవత్సరంలో యువత ఉపాధికి రూ.9వేల కోట్లు ఖర్చు చేయలేదని తెలంగాణలో అమలు చేస్తున్న రాజీవ్ యువ వికాసం చరిత్రలో నిలిచి పోతుందన్నారు.

మిగులు బడ్జెట్‌తో ఏర్పడిన రాష్ట్రాన్ని పదేండ్లు పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగుల ఆశలను, ఆకాంక్షలను, వమ్ము చేసిందని, వయోభారం నిరాశలో కూరుకుపోయిన యువతను ఆదుకోవడానికే ఇందిరమ్మ ప్రజాప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి రాజీవ్ యువ వికాస పథకాన్ని అమలులోకి తెచ్చిందన్నారు. సిబిల్ స్కోర్ పేరుతో అవగాహన లేని సంస్థలు సోషల్ మీడియాలు అసత్య ప్రచారం చేస్తున్నాయని నిరుద్యోగులు నమ్మవద్దని కోరారు. గతంలో ఎస్సీ, బీసీ, ఐటీడీఏ తదితర సంస్థల రుణాలు పొందిన వారు ఉన్నారని రాజీవ్ యువ వికాసంలో కొత్త వారికి అవకాశం లభించాల్సి ఉందని వెల్లడించారు. లబ్ధిదారుల ఎంపికకు సిబిల్ స్కోర్ ట్రాక్ రికార్డు రికవరీ లాంటి అంశాలు పరిగణలోకి తీసుకోరని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కోరం కనకయ్య, మాలోతు రాందాస్‌నాయక్, అటవీ అభివృద్ధి సంస్థ చైర్మెన్ పొదెం వీరయ్య, జిల్లా కలెక్టర్ జితేశ్ వి పాటిల్, సింగరేణి కాలరీస్ చైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరాం, ఎస్పీ రోహిత్‌రాజు, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రాహుల్, తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందు నియోజకవర్గంలో బయ్యారం, టేకులపల్లి (మిగతా 6వ పేజీలో)

ఎల్‌డబ్ల్యూఈ రోడ్ల నిర్మాణానికి అనుమతులివ్వండి

- పోడు భూముల్లో వెదురు సాగుకు ప్రాధాన్యం
- ఉమ్మడి జిల్లాలో మూడు పార్కుల అభివృద్ధికి చర్యలు
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- హైదరాబాద్‌లో అటవీశాఖ అధికారులతో సమీక్ష

6



వడ్డీ దందా.. నయాపంథా..

- జిల్లాలో జోరుగా అక్రమ ఫైనాన్స్, అనధికారిక చిట్టీల వ్యాపారం
- అప్పునకు బదులుగా ఆస్తుల రిజిస్ట్రేషన్లు
- ఆలస్యమైతే అసలుకు రెట్టింపు ఇవ్వాలని బెదిరింపులు
- రోడ్డున పడుతున్న సామాన్య, మధ్యతరగతి కుటుంబాలు

7

రారెత్తిస్తున్న ఎండలు

- నిప్పుల గుండాన్ని తలపిస్తున్న రోడ్లు
- మధ్యాహ్నం వీధులన్నీ నిర్మానుష్యం
- వడదెబ్బతో రాలుతున్న ప్రాణాలు

6

సీబీఎస్ఈ ఫలితాల్లో హార్వెస్ట్ విద్యార్థుల హవా



పదోతరగతి విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం



12వ తరగతి విద్యార్థులతో కళాశాల కరస్పాండెంట్ రవిమారుత్

ఖమ్మం ఖానాపురంహవేలి, మే 13(ఆంధ్రజ్యోతి): మంగళవారం ప్రకటించిన సీబీఎస్ఈ (సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్) పదోతరగతి ఫలితాలలో నగరంలోని హార్వెస్ట్ కళాశాల ప్లస్ వన్ విద్యార్థులు విజయ పరంపర కొనసాగించారని విద్యాసంస్థల కరస్పాండెంట్ రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతీరెడ్డిలు తెలిపారు. 500ల మార్కులకు గాను పాఠశాలకు చెందిన కె.రిషిత్ 492, ఎస్.తేజస్వీ 489, బి.హిమవర్షిణి 487, ఎం.ధన్విత 485, బి.చందన ప్రియ 483, ఎస్కే షాజియా ఇరం 483, పి.ధీరజ్ 481, బి.సహస్ర 480, పి. భువన్ 480 వంటి అత్యుత్తమ మార్కులు సాధించారని తెలిపారు. తెలుగులో 59మందికి ఏ గ్రేడ్, హిందీలో 11 మందికి ఏ గ్రేడ్, ఆంగ్లంలో 100 మంది, గణితంలో 96 మందికి, సైన్స్‌లో 73 మందికి, సోషల్‌లో 31 మందికి ఏ గ్రేడ్ సాధించటంతోపాటు నూరు శాతం ఫలితాలు సాధించామని తెలిపారు. అనంతరం విద్యార్థులను అభినందించారు.

12వ తరగతి ఫలితాల్లో

మంగళవారం ప్రకటించిన సీబీఎస్ఈ ప్లస్ 2ఫలితాల్లో నగరంలోని హార్వెస్ట్ కళాశాల విద్యార్థులు విజయదుందుభి మోగించారని విద్యాసంస్థల కరస్పాండెంట్ రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతీరెడ్డి తెలిపారు. కళాశాలకు చెందిన ఎస్.రాఘవేంద్ర నవనీత్ 487, రేపల్లి శ్రీస 484, బి. సాయిచరణ్ 482, ఎం.నాగయశ్వంత్ 482, బి.సిద్ధార్థ 480, ఎస్‌సీహెచ్. జశ్వంత్ సాయి 478, బి.సంజయ్ 477, జి.రాణిఉమా అలేఖ్య 475, డి. శ్రీనివాస గౌతమ్‌రెడ్డి 472, కె.రోహిత్ 471, టీడీవీఎస్. నైమాంజలి 470, బి.భార్గవి 470వంటి అత్యుత్తమ మార్కులతో విజయదుందుభి మోగించారని తెలిపారు. 5గురికి 480కి పైగా, 12మందికి 470కి పైగా, 450కి పైగా 18మంది మార్కులు సాధించారని, వీరితోపాటు నూరుశాతం ఫలితాలు సాధించామని తెలిపారు. ఆంగ్లంలో 45 మందికి, గణితంలో 25 మందికి, భౌతికశాస్త్రంలో 25మందికి, రసాయనశాస్త్రంలో 23మందికి, బయాలజీలో 11 మంది ఏ గ్రేడ్‌లు సాధించారని తెలిపారు.



విక్టరీ సింబల్ చూపిస్తున్న విద్యార్థులు, యాజమాన్యం

సీబీఎస్ఈలో సత్తా చాటిన న్యూ లిటిల్‌ఫ్లవర్

వైరా, మే 13 (ఆంధ్రజ్యోతి): సీబీఎస్ఈ 10,12 ఫలితాల్లో న్యూ ఇరా వారి వైరాలోని న్యూలిటిల్‌ఫ్లవర్ విద్యార్థులు సత్తా చాటారు. ప్రతిభచాటిన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ పి.భూమేశ్వరరావు అభినందించి హర్షం వ్యక్తం చేశారు. పదిలో నూరుశాతం ఉత్తీర్ణత సాధించారు. 172 మంది విద్యార్థులు పరీక్షలు రాసి ఉత్తీర్ణులయ్యారు. బండి రమ్యశ్రీ, ఏలూరి త్రియ482/500 (97శాతం), గూడూరు ఊహిత, అంచూరి అంజలి 96 శాతం, డి.స్వాతికచౌదరి 95శాతం, మేడా చర్విత, మణికంఠ, మేఘన 94శాతం మార్కులు సాధించారు. అలాగే 22 మంది విద్యార్థులు 90శాతం పైగా మార్కులతో ఉత్తీర్ణులయ్యారు. 12వ తరగతి ఫలితాల్లో కూడా నూరుశాతం ఉత్తీర్ణత సాధించారు. పరీక్షలు రాసిన 48మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. వీరిలో 31మంది విద్యార్థులు ప్రథమ శ్రేణిలో, మిగిలిన విద్యార్థులు ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. బోజడ్ల తేజశ్రీ 450/500 మార్కులు సాధించింది. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను న్యూఇరా విద్యాసంస్థల చైర్మన్ ఐవీ.రమణారావు, కరస్పాండెంట్ పి.భూమేశ్వరరావు, డైరెక్టర్లు డాక్టర్ కాపా మురళీకృష్ణ, లగడపాటి ప్రభాకర్‌రావు, ప్రిన్సిపాల్ షాజీ మాథ్యూవ్, ఏవో ఎస్.నర్సింహారావు అభినందించారు.



విద్యార్థులతో అధ్యాపక బృందం

సీబీఎస్ఈ పదో తరగతి ఫలితాల్లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రభంజనం

ఖమ్మం ఖానాపురంహవేలి, మే 13 (ఆంధ్రజ్యోతి): మంగళవారం ప్రకటించిన సీబీఎస్ఈ పదో తరగతి ఫలితాల్లో నగరంలోని శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని విద్యా సంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్యలు తెలిపారు. పాఠశాలకు చెందిన కాసిన. జశ్వంత్ 489, కవితాచౌదరి 485, యశస్విత 484, సూర్యతేజ 483, సంహితరెడ్డి 480 వంటి ఉత్తమ మార్కులు సాధించారని తెలిపారు. పాఠశాల నూరు శాతం ఫలితాలు సాధించిందని తెలిపారు. 30 మంది విద్యార్థులు 450కి పైగా మార్కులు సాధించారని తెలిపారు. అనంతరం విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ నాగప్రవీణ, టీఎల్ఎన్. శర్మ, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఉత్తీర్ణులైన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

సీబీఎస్ఈ ఫలితాల్లో బ్లూమింగ్‌మైండ్స్ విద్యార్థుల ప్రతిభ

ఖమ్మం ఖానాపురంహవేలి, మే 13(ఆంధ్రజ్యోతి): మంగళవారం ప్రకటించిన సీబీఎస్ఈ పతోతరగతి, ప్లస్ 2 ఫలితాలలో నగరంలోని బ్లూమింగ్‌మైండ్స్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని కళాశాల కరస్పాండెంట్ అశోక్‌రెడ్డి తెలిపారు. కళాశాలకు చెందిన ప్లస్ వన్ విద్యార్థులు పి.గౌతమ్ 97.8 శాతం, కె.జశ్వంత్‌కుమార్ 94 శాతం, జి.సాత్విక్‌గౌడ్ 93 శాతం, జి.వర్షిత 92 శాతం, జె.సాత్విక్ 91 శాతం, బి.విఘ్నేష్ 91 వాతం, బి.లాస్య, యం.ఉజ్వల్, జి. శివాని, ఆర్.గిరధర్‌రెడ్డి, ఎ.ఉమామహేశ్వరరావులు 90శాతం మార్కులు సాధించారని తెలిపారు. 12వ తరగతిలో బైపీసీలో సీహెచ్.గణేష్ జిహెచ్. రియా, కె. పూజానందిని, సాయిధీరజ్, త్రివేణిలు 88శాతానికి పైగా మార్కులు సాధించటంతోపాటు నూరు శాతం ఫలితాలు సాధించామని తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

శరవేగంగా పాలేరు జలవిద్యుత్ కేంద్రం మరమ్మతులు

- పరిశీలించిన విద్యుత్ సౌధ (సివిల్) సిఈ నారాయణ
- నెలాఖరులోగా పూర్తి చేస్తామని వెల్లడి

కూసుమంచి, మే 13(ఆంధ్రజ్యోతి):పాలేరు జలవిద్యుత్‌కేంద్రం మరమ్మతు పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. పనులు ఈనెలాఖరులోగా పూర్తిచేసి, వచ్చే సీజన్ నాటికి విద్యుత్ ఉత్పత్తి చేసేవిధంగా ప్రాజెక్టును సిద్ధం చేసేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఈ మేరకు విద్యుత్‌సౌధ (సివిల్) చీఫ్ ఇంజనీర్ నారాయణ, పులించింతల ఎస్ఈ దేశ్యానాయక్ పనులను పర్యవేక్షిస్తున్నారు. గతేడాది సెప్టెంబరు 1న వచ్చిన పాలేరు వరదల కారణంగా జలవిద్యుత్‌కేంద్రం నీటమునిగిన సంగతి తెలిసిందే. విద్యుతుత్పత్తి చేసే రెండు టర్బైన్‌లు, మోటార్లు అన్నీ నీటమునిగాయి. జలవిద్యుత్ కేంద్రం వద్ద కాల్వకు మూడుచోట్ల గండ్లు పడ్డాయి. దీంతో ప్రాజెక్టుకు తీవ్రనష్టం వాటిల్లింది.

రూ.5కోట్లతో మరమ్మతులు

ప్రాజెక్టుకు నీరు వచ్చే సాగర్ ప్రధానకాల్వకు మూడు చోట్ల గండ్లు పడటంతో మరమ్మతులు చేసేందుకు ప్రభుత్వం రూ.మూడు కోట్లు మంజూరు చేసింది. అయితే ప్రస్తుతం కట్ట మరమ్మతులు శరవేగంగా జరుగుతున్నాయి. కట్టకు లైనింగ్ పనులు, సీసీ రోడ్డు నిర్మాణపనులు జరుగుతున్నాయి. అదేవిధంగా మెకానికల్, ఎలక్ట్రికల్ పనులకు మరో రూ.2కోట్లుమంజూరు అయ్యాయి. ఎలక్ట్రికల్, పరికరాల కొనుగోలుకు సంబంధించి పూర్తిస్థాయిలో ప్రభుత్వం నుంచి అనుమతులు రాకపోవడంతో ప్రస్తుతానికి టర్బైన్లు, కూలింగ్ వాటర్ మోటార్లు, ప్యానల్ బోర్డులు, రిలేస్, బ్రేకర్లు, మొత్తం కాంటాక్ట్‌ను పాతవాటినే మరమ్మతులు చేసి సిద్ధం చేస్తున్నారు. గతేడాది పూర్తిస్థాయిలో నడవకపోవడంతో.. ఈ ఏడాదైనా విద్యుత్ ఉత్పత్తి చేయాలనే సంకల్పంతో.. ఈనెలాఖరు వరకు పనులు పూర్తిచేసి వచ్చే సీజన్‌లో రెండు యూనిట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసే పనిలో ఉన్నారు.

నెలాఖరుకు పనులు పూర్తి

విద్యుత్ సౌధ (సివిల్) చీఫ్ ఇంజనీర్ నారాయణ

పాలేరు జలవిద్యుత్ కేంద్రంలో గతేడాది వచ్చిన పాలేరు వరదల కారణంగా ప్రాజెక్టు మొత్తం నీటమునిగింది. ప్రస్తుతం సివిల్, ఎలక్ట్రికల్, మెకానికల్ పనులు శరవేంగగా జరుగుతున్నాయి. ఈనెలాఖరులోగా పనులు పూర్తి చేసే విధంగా కృషి చేస్తున్నాం. పారదర్శకంగా ఎటువంటి అవకతవకలు లేకుండా శాశ్వత మరమ్మతులు చేస్తున్నాం.

ఫారెస్ట్ భూములను ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటాం

- అటవీ సంపదను కాపాడటం అందరి బాధ్యత
- చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ భీమా నాయక్

లక్ష్మీదేవిపల్లి, మే 13 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి జిల్లాలోని ఫారెస్ట్ భూముల్లో కబ్జాలు చేసి నిర్మాణాలు చేపడితే అటవీశాఖ చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ భీమా నాయక్ స్పష్టం చేశారు. అటవీ సంపను సంరక్షించడం అందరి బాధ్యతగా భావించాలన్నారు. భద్రాద్రి జిల్లా పర్యవేక్షణలో భాగంగా మంగళవారం లక్ష్మీదేవిపల్లిలోని ఇల్లెందు గెస్ట్ హౌస్‌లోని ఆయన కార్యాయలంలో విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో ఫారెస్టు అభివృద్ధి కోసం అటవీశాఖ అనేక కార్యక్రమాలు చేపట్టిందని, అందులో భాగంగా ప్లాంటేషన్ అభివృద్ధితోపాటు కిన్నెరసాని ప్రాజెక్టు మూడు సఫారీ వాహనాలను ఏర్పాటు చేసి పర్యాటకులను ఆకర్షించే విధంగా ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. వృక్షాల, జంతువులు, ఫారెస్ట్ భూములు సంరక్షించేందుకు విజిలెన్స్ అధికారులు పర్యవేక్షించేట్లు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఏమైనా ఆక్రమణలు, సమస్యలు ఉన్నట్లయితే అధికారులు తెలియచేస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని విజ్ఞప్తి చేశారు. అటవీ సంరక్షణతో భావితరాలకు ఎంతో మేలు జరుగుతుందని, వృక్షాలను కాపాడితే సకాలంలో వర్షాలు కురిసే వాతావరణం సమతుల్యత చేకూరుతుందని తెలిపారు. ఆయన వెంట ఎఫ్‌డీవో కోటేశ్వరరావు ఉన్నారు.

ఎల్‌డబ్ల్యూఈ రోడ్ల నిర్మాణానికి అనుమతులివ్వండి

- పోడు భూముల్లో వెదురు సాగుకు ప్రాధాన్యం
- ఉమ్మడి జిల్లాలో మూడు పార్కుల అభివృద్ధికి చర్యలు
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం (ఆంధ్రజ్యోతి ప్రతినిధి)/కొత్తగూడెం, మే 13 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో అటవీశాఖకు సంబంధించిన పలు సమస్యలు సత్వరం పరిష్కరించాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. హైదరాబాదులోని సచివాలయంలో మంగళవారం అటవీశాఖ ప్రధాన సంచాలకులు సువర్ణ, ఫారెస్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ సునీత తదితరులతో కలిసి సమావేశం నిర్వహించారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో వనసంపదను కాపాడేందుకు యుద్ధప్రాపతిదికన చర్యలు చేపట్టాలని, ఇందుకు సంబంధించి ఆదేశాలు జారీ చేయాలని సూచించారు. ఫారెస్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా అడవుల సంరక్షణ చర్యలు చేపట్టాలని, అడవుల సంరక్షణతోనే మానవజాతి మనుగడ సాధ్యమవుతుందని తెలిపారు. 40ఏళ్ల క్రితం అడవుల సంరక్షణ, అభివృద్ధికి ఫారెస్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ విశేష కృషి చేసిందని మంత్రి తుమ్మల గుర్తుచేశారు. మళ్లీ ఆ స్థాయిలో గుర్తింపు రావాలని, ఇందుకు అధికారులు కృషిచేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న ఏజెన్సీ రహదారుల నిర్మాణానికి తక్షణం అనుమతులు ఇవ్వాలని ఆదేశించారు.

అలాగే ఉమ్మడి జిల్లాలో మూడు అటవీ పార్కుల అభివృద్ధికి పనులు చేపట్టాలని సూచించారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంత అభివృద్ధి పథకం కింద నిధులు మంజూరు చేయడం జరిగిందని, ఉమ్మడి జిల్లాలో ఆరు ప్రధాన రహదారులకు తక్షణం అటవీశాఖ అనుమతులు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జూలూరుపాడు మండలం పడమనర్సాపురం నుంచి అన్నారంపాడు, చుంచుపల్లి మండలం పాత అంజనాపురం నుంచి బేతంపుడి వరకు జూలూరుపాడు, సుజాతనగర్ మండలాల్లో కొమ్ముగూడెం నుంచి రాఘవాపురం వరకు, లక్ష్మీదేవిపల్లి మండలంలోని హేమచంద్రాపురం నుంచి జూబ్లీపుర గుట్ట వరకు, టేకులపల్లి మండలంలోని వెంకట్‌తండా నుంచి కుంట్ల రోడ్డు వరకు, దుమ్ముగూడం మండలంలోని కొత్తపల్లి మెయిన్‌రోడ్డు నుంచి ఏపీ సరిహద్దు వరకు, రోడ్ల నిర్మాణానికి అటవీశాఖ అనుమతులు ఇవ్వాలని తెలిపారు.

పర్యాటకశాఖ అభివృద్ధి కింద నూతన పార్కుల నిర్మాణానికి కృషిచేయడం జరుగుతుందని ప్రధానంగా ఖమ్మంలోని వెలుగుమట్ల పార్కు, సత్తుపల్లి, తల్లాడ మండలాల్లో విస్తరించిన కనకగిరి హిల్స్ ఎకోటూరిజం, కొత్తగూడెంలో ఎకోటూరిజం పార్కు అభివృద్ధిపై కేంద్రీకరించాలని, పర్యాటకులను ఆకర్షించేలా ఆధునిక హంగులతో, అత్యాధునిక సౌకర్యాలతో పార్కుల నిర్మాణం చేపట్టాలని కోరారు. పార్కుల అభివృద్ధి ద్వారా పర్యాటకంగా ఎక్కువ మంది రావడం జరుగుతుందని దక్షిణ అయోధ్యగా పేరొందిన భద్రాది పుణ్యక్షేత్రానికి అనేక ప్రాంతాల నుంచి భక్తులు రావడం జరుగుతుందని ఈ పార్కుల అభివృద్ధి ద్వారా పర్యాటకంగా మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందన్నారు. ఏజెన్సీలో ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజల ఆదాయ మార్గాల పెంపు దిశగా అటవీశాఖ చర్యలు తీసుకోవాలని కోరారు. పర్యాటకంగా అభివృద్ధి చేస్తే గిరిజన అభివృద్ధి కూడా సాధ్యమవుతుందని, వనసంరక్షణతో ప్రకృతి అభివృద్ధి చెందుతుందని, గిరిజనుల జీవితాల్లో వెలుగులు చూస్తామని అధికారులకు మంత్రి సూచించారు.



హైదరాబాద్‌లో అటవీశాఖ అధికారులతో సమావేశమైన మంత్రి తుమ్మల

ఆగిపోయిన రోడ్లు ఇవే...

ఎల్‌డబ్ల్యూఈ కింద నిధులు మంజూరైనా అటవీశాఖ అనుమతి లేకపోవడంతో సుదీర్ఘకాలంగా రోడ్లు నిలిచిపోయాయి. ప్రధానంగా జూలూరుపాడు మండలంలోని నర్సాపురం నుంచి అన్నారప్పాడు రూ.6.50కోట్లు, జూలూరుపాడు, సుజాతనగర్ మండలాల్లోని కొమ్ముగూడెంనుంచి రాఘవాపురానికి రూ.4.52కోట్లు, లక్ష్మీదేవిపల్లి మండలంలోని హేమచంద్రాపురం నుంచి జూబ్లీపురం గుట్ట వరకు రూ.6.60 కోట్లు, టేకులపల్లి మండలంలోని వెంకటయ్యతండా నుంచి కుంటల రోడ్డు వరకు రూ.7.43కోట్లు, దుమ్ముగూడెం మండలంలోని కొత్తపల్లినుంచి ఏపీ సరిహద్దు వరకు రూ.3.30 కోట్లతో రహదారులకు నిధులు మంజూరైనా అటవీశాఖ అనుమతులు లేకపోవడంతో నిరుపయోగంగా ఉన్నాయి. ఏజెన్సీప్రాంత అభివృద్ధికి గతంలో మంత్రిగా ఉన్నప్పుడు తుమ్మల నిధులు మంజూరు చేయించారు. ఎల్‌డబ్ల్యుఈ కింద నిధులు కేటాయింపు జరిపినా అటవీశాఖ అనుమతులు లేక మంజూరుకు నోచుకోలేదు.



నేడు ఎర్రుపాలెం, బోనకల్ మండలాల్లో భట్టి పర్యటన

మధిరటౌన్/ఎర్రుపాలెం, మే 13 (ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క బుధవారం మధిర నియోజకవర్గంలోని ఎర్రుపాలెం, బోనకల్ మండలాల్లో పర్యటించనున్నారు. డిప్యూటీ సీఎం భట్టి మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పర్యటన ముగించుకుని రాత్రికి మధిరలోని ఆయన క్యాంపు కార్యాలయానికి చేరుకోనున్నారు, బుధవారం ఉదయం ఎర్రుపాలెం మండల కేంద్రంలో రూ.22 కోట్లతో నిర్మించనున్న 50 పడకల ఆస్పత్రి భవనానికి శంకుస్థాపన చేయనున్నారు. తరువాత మండలంలోని వివిధ గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం బోనకల్ మండలం లోని పలు గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం సాయంత్రం 5 గంటలకు తిరిగి హైదరాబాద్ వెళ్లనున్నారు.

ఎర్రుపాలెం మండలంలో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క బుధవారం పర్యటించనున్నారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నట్టు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని రూ.22కోట్లతో నిర్మించే 50 పడకల ప్రభుత్వ ఆస్పత్రికి శంకుస్థాపన చేయనున్నారు. కంద్రిక గ్రామం నుంచి పెద్ద గోపవరం వరకు రూ.2కోట్ల62లక్షలతో, బనిగండ్లపాడు నుంచి బంజర వరకు రూ.5 కోట్ల74లక్షలతో నిర్మించే బీటీ రోడ్లకు శంకుస్థాపన చేస్తారు.

రారెత్తిస్తున్న ఎండలు

- నిప్పుల గుండాన్ని తలపిస్తున్న రోడ్లు
- మధ్యాహ్నం నిర్మానుష్యమవుతున్న వీధులు
- వడదెబ్బతో రాలుతున్న ప్రాణాలు



చల్ల చల్లని కొబ్బరి బొండాలు



నగరంలో విక్రయిస్తున్న ముంజలు

ఖమ్మం సాంస్కృతికం, మే 13 (ఆంధ్రజ్యోతి): ఎండలు రారెత్తిస్తుండటంతో ప్రజలు ఇళ్లల్లోనుంచి బయటకు వచ్చేందుకు హడలి పోతున్నారు.. పగటి ఉష్ణోగ్రతలో ఒక్కసారిగా పెరిగి పోవటంతో వేడిమితో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.. 44 డిగ్రీల వరకు ఎండ తీవ్రత నమోదవుతుండటం పరిస్థితికి అద్దం పడుతోంది. సింగరేణి ప్రాంతాలకు దీటుగా ఖమ్మం తదితర ప్రాంతాల్లో ఎండ తీవ్రత ఉంటోంది. రోహిణి కార్తె సమీపిస్తుండటంతో గత వారం, పది రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు పెరిగి పోతున్నాయి. నైరుతి రుతుపవనాలు వచ్చేస్తున్నాయని రాష్ట్రంలో అంతకు ముందుగానే వానలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటిస్తున్నప్పటికీ వాతావరణ వాస్తవపరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. ఉదయం ఎనిమిది గంటల నుంచే ఎండవేడిమి అంతకంతకూ రెట్టింపవుతూ ఇబ్బందులు గురిచేస్తోంది. వడగాడ్పులు , చెమట, ఉక్కబోతలతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఇళ్లల్లో ఏసీలు నిరంతరాయంగా తిరుగుతున్నా ఎండ గాడ్పుల నుంచి తప్పించుకోలేక పోతున్నారు. ఇక ఏసీలు లేని వారు కూలర్లపై ఆధారపడుతుండటంతో జిల్లా వ్యాప్తంగా కూలర్ల వ్యాపారాలు జోరందుకుంటున్నాయి. గత పది రోజుల క్రితం అడపా దడపా చెడు వానలు కురవటం వల్ల ఎండ వేడిమిఉక్కబోత స్థితి అధికం అవుతోందని జనం చర్చించుకుంటున్నారు. సిమెంటు, తారు రోడ్లపై తీవ్రమైన ఎండ కారణంగా నిప్పుల గుండాన్ని తలపిస్తున్నాయి. దీంతో జనం బయటకు వచ్చేందుకు భయపడుతున్నారు. తప్పనిసరి పనులపై వచ్చే వారు ఉదయం పదిగంటల లోగా తమ పనులను పూర్తి చేసుకుంటున్నారు. తలకు టోపీలు ధరించటం, గొడుగులు ఉపయోగించటం, కూలింగ్ గ్లాసులు ధరిస్తున్నారు. వేసవి తాపాన్నుంచి రక్షించుకునేందుకు కొబ్బరిబోండాలు, చెరకు రసాలు, శీతల పానీయాలను వినియోగిస్తున్నారు. పదకొండుగంటల నుంచి సాయంత్రం వరకు రోడ్లపై జన సంచారం గణనీయంగా తగ్గుతోంది. ఎండ తీవ్రత బారిన పడకుండా ప్రజలు జాగ్రతలు వహిస్తున్నా పలువురు అస్వస్థలకు గురవుతున్నారు. దీంతో పలు ఆసుపత్రుల్లో వడదెబ్బ బాధితుల సంఖ్య పెరుగుతోంది. వీరిలో కొందరు మృత్యువాత పడుతున్నారు. మంగళవారం జిల్లాలో చింతకాని మండలం నాగులవంచలో వడదెబ్బతో మహిళ మృతి చెందగా , మధిర రూరల్ మండలం నిదానపురంలో వడదెబ్బకు మరొక వ్యక్తి మృతి చెందాడు. జిల్లాలో మూడు మండలాలు మినహా, మిగిలిన అన్ని మండలాలు అలర్ట్ జాబితాలో ఉండటం ఎండ తీవ్రతనుసూచిస్తోంది. అత్యధికంగా ముదిగొండ మండలం బాణాపురం, పమ్మిగ్రామాల్లో 43.3, నేలకొండపల్లి లో 43.2, ఖమ్మం అర్బన్, నేలకొండపల్లిలో 43 సెంటీగ్రేడుల ఉష్ణోగ్రత నమోదయింది.



భద్రాద్రి జిల్లాకు సీతారామ జలాలు

(5వ పేజీ తరువాయి)

మండలాలల్లో మంగళవారం ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఎమ్మెల్యే కోరం కనకయ్యతో కలిసి పలు అభివృద్ధి పథకాలకు శంకుస్థాపనలు చేశారు. బయ్యారం మండలంలో లక్ష్మీనర్సింహాంపురంలో విద్యుత్తు సబ్ స్టేషన్ గొల్లగూడెం వద్ద హౌలెవల బ్రిడ్జి పనులకు శంకుస్థాపనలు చేశారు. అనంతరం గంధంపల్లి గ్రామంలో ఇందిదాగాంధీ విగ్రహం ఆవిష్కరించారు. అనంతరం టేకులపల్లి మండలం ముత్యాలంపాడు వద్ద విద్యుత్తు సబ్ స్టేషన్‌కు పనులకు శంకుస్థాపన చేశారు.

ఘన స్వాగతం... ఇల్లెందు నియోజకవర్గానికి ప్రప్రథమంగా విచ్చేసిన ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు ఘనస్వాగతం లభించింది. కాంగ్రెస్ జిల్లా నాయకులు కోరం సురేందర్, మాజీ మున్సిపల్ చైర్మెన్‌లు దమ్మాలపాటి వెంకటేశ్వర్‌రావు, యదళ్లపల్లి అనసూయ, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు డాక్టర్ రవి. కాంగ్రెస్ పట్టణ మండల అధ్యక్షులు డానియల్, పులి సైదులు, మార్కెట్ కమిటి చైర్మెన్ రాంబాబు, కాంగ్రెస్ నాయకులు ఎస్సే జాని, సాంబమూర్తి, బోళ్ల సూర్యం, మండల రాము, ఇబ్రహీం స్వాగతం పలికారు.



భట్టికి జ్ఞాపిక బహూకరిస్తున్న దృశ్యం

'ఈస్థటిక్స్' పురస్కారాలకు ఆహ్వానం

ఖమ్మం సాంస్కృతికం, మే 13 (ఆంధ్రజ్యోతి): సాహిత్యంలో ప్రతిభావంతులకు బహూకరించే ఈస్థటిక్స్ పురస్కారాల ప్రదానం కోసం ఆగస్టు31వ తేదీలోగా రచనలను ఆహ్వానిస్తున్నట్లు సాహిత్య సంస్థ బాధ్యుడు రవిమారుత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024 ఏప్రిల్, 2025 మార్చి మధ్యలో ఆవిష్కృతమైన కవిత్వ సంపుటాలను నాలుగు ప్రతులు పోటీకి పంపాలన్నారు. కవిత్వ సంపుటి 25 కవితలకు తగ్గకుండా ఉండాలన్నారు. కథల విభాగంలో పోటీకోసమే ప్రత్యేకంగా కథలను రాసి పంపాల్సి ఉంటుందన్నారు. ఇతర పోటీలకు పంపలేదన్న హామీ పత్రం జత చేసిన నాలుగు ప్రతులతోపాటు యూనికోడ్ సాఫ్ట్ కాపీని మెయిల్ చేయాలన్నారు. బహుమతి పొందిన కథలతోపాటు మరో తొమ్మిది ఉత్తమ కథలతో కలిపి పుస్తకంగా తీసుకువస్తామన్నారు. కవిత్వ, కథల పోటీల విజేతలకు నవంబరులో ఖమ్మంలో జరిగే సభలో అవార్డులు అందజేస్తామని చెప్పారు. మూడు ఉత్తమ కథలకు మొదటి బహుమతి రూ.25వేలు, ద్వితీయ బహుమతి రూ.15వేలు, తృతీయ బహుమతి రూ.10వేలు ప్రత్యేక ప్రశంసాపత్రం అందజేస్తామన్నారు. ఉత్తమ కవితా సంపుటికి రూ.40వేల బహుమతి తోపాటు ప్రశంసాపత్రం, సత్కారం ఉంటుందన్నారు. కవిత్వ సంపుటాలను, కథలను ఖమ్మం ఈస్థటిక్స్ సాహిత్య పురస్కారాలు, 5-7-200/11 పాకబండ బజార్ ఖమ్మం, 507 003 ఫోన్‌నెంబర్ 9849114369 అనే చిరునామాకు పంపాలన్నారు.

గిరిజన గురుకులాల్లో ఇంటర్ స్పాట్ అడ్మిషన్లు

కొత్తగూడెం అర్బన్, మే 13 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలోని గిరిజన సంక్షేమ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ మొదటి విద్యా సంవత్సరం(2024-25)లో సీట్ల భర్తీకి దరఖాస్తులు స్వీకరించనున్నామని రీజనల్ కో ఆర్డినేటర్ బి. అరుణకుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మే 15న బాలుర కోసం, 16వ తేదీన బాలికల కోసం భద్రాచలం గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాల కార్యాలయంలో ఉదయం తొమ్మిది గంటలకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నామన్నారు. బాలికల కోసం భద్రాచలం, భద్రాచలం(సీవోఈ), 2సుదిమళ్ల, మణుగూరు, కొత్తగూడెం, అన్నపురెడ్డిపల్లి, అంకంపాలెం, వైరా కళాశాలలో, బాలుర కోసం కిన్నెరసాని డ్యామ్ సైడ్, కిన్నెరసాని డ్యామ్ సైడ్(సీవోఈ), దమ్మపేట, దమ్మపేట(సీవోఈ), 2గుండాల, క్రిష్ణాసాగర్, సింగరేణి, తిరుమలాయపాలెం కళాశాలను ఏర్పాటుచేశామన్నారు. గిరిజన సంక్షేమ గురుకుల కళాశాలలో విద్యార్థులు ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీలతో పాటు ఒకేషనల్ గ్రూప్‌లలో జాయిన్ అయ్యేందుకు స్పాట్ అడ్మిషన్ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని అన్నారు. అడ్మిషన్ల కోసం పదో తరగతి మెమో, టీసీ, బోనోఫైడ్, కుల, ఆదాయ, ఫిజికల్ ఫిట్నెస్ ధ్రువీకరణ పత్రాలతో పాటు ఆధార్ కార్డు, ఆరు పాస్ పోర్ట్‌సైజ్ ఫొటోలు తీసుకురావాలన్నారు. ఈ అవకాశాన్ని ఉమ్మడి ఖమ్మం జిల్లా గిరిజన యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

'సీతారామ' ద్వారా సాగునీరివ్వాలి

- తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని



మాట్లాడుతున్న పోతినేని సుదర్శన్

సుజాతనగర్, మే 13 (ఆంధ్రజ్యోతి): సింగభూపాలెం చెరువుకు సీతారామ ప్రాజెక్టు ద్వారా సాగునీరు ఇవ్వాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్ అన్నారు. మంగళవారం ఉదయం సింగభూపాలెం రైతులతో కాట్రాల తిరుపతిరావు అధ్యక్షతన గ్రామ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పోతినేని సుదర్శన్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సీతారామ ప్రాజెక్ట్ ద్వారా భద్రాద్రి జిల్లాలోని చెరువులకు అనుసంధానం చేసి గోదావరి జలాలు సాగు భూములకు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. భూములు కోల్పోయే భద్రాద్రి జిల్లా రైతుల తలాపునే గోదావరి నది ప్రవహిస్తున్నా సాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మచ్చా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలు రాకుండా అడ్డుకుంటే జిల్లా వ్యాప్తంగా ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నెల 20న దేశ వ్యాప్తంగా జరిగే గ్రామీణ హర్తాళ్, సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

వడదెబ్బతో వ్యక్తి మృతి



మధిరరూరల్, మే13(ఆంధ్రజ్యోతి): వడదెబ్బ తగిలి వ్యక్తి మృతిచెందిన సంఘటన మంగళవారం మధిర మండలం నిదానపురం గ్రామంలో జరిగింది. మృతుని కుటుంబసభ్యుల తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలో కనపర్తి దానయ్య(49) సోమవారం పొలంలో వ్యవసాయ కూలీ పనికి వెళ్లాడు. వడదెబ్బకు సొమ్మసిల్లి పొలంలోనే పడిపోయాడు. దీంతో అతణ్ని చికిత్స కోసం ఖమ్మం ఆసుపత్రికి తరలించారు చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు.

కాపర్‌వైరు చోరీ



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న విద్యుత్‌శాఖ ఎల్ఐ

అశ్వాపురం, మే13(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నెల్లిపాక బంజరు గ్రామంలో పంటపొలంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు సోమవారం రాత్రి ధ్వంసం చేసి అందులో ఉన్న కాపర్‌వైరును చోరీ చేశారు. మండల పరిధిలోని మొండికుంట గ్రామానికి చెందిన మిట్టకంటి వెంకటరెడ్డి నెల్లిపాక బంజరులో ఉన్న తన పొలంలో ప్రత్యేకంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసుకున్నాడు. ఇటీవల పంటకాలం పూర్తికావటంతో గమనించిన వ్యక్తులు రూ.20వేల విలువ చేసే కాపర్‌ను దొంగిలించారు. రైతు ఫిర్యాదు మేరకు విద్యుత్‌శాఖాధికారులు సంఘటనా స్థలాన్ని సందర్శించి వివరాలు సేకరించారు. కాగా గతంలో కూడా నెల్లిపాక బంజరు గ్రామానికి చెందిన పలువురు రైతుల విద్యుత్ మోటార్లు,ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురయ్యాయి. ఇప్పటికైనా పోలీస్ అధికారులు నిఘా ఏర్పాటుచేసి దొంగతనాలను అరికట్టాలని రైతులు కోరుతున్నారు.

బీరువాలు పగులగొట్టి..

మణుగూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): మణుగూరు ఏరియాలోని పీవీ కాలనీలో ఎంసీ316 క్వార్టర్‌లో దొంగలు పడి నగదు, వెండి సామగ్రి అపహరించినట్లు పోలీసుస్టేషన్‌లో మంగళవారం కేసు నమోదు అయింది. బాధితుడు సింగరేణి మాజీ ఉద్యోగి ఎస్‌డీ నాసర్ పాషా తెలిపిన వివరాల ప్రకారం.. నాసర్ పాషా తన కుటుంబ సభ్యులతో కలసి తన స్వగ్రామానికి వెళ్లి మంగళవారం తిరిగి ఇంటికి చేరుకున్నాడు. ఇంటిని పరిశీలించే సరికి ఇంటి తలుపులు, గదిలో రెండు బీరువాల తాళాలు పగుల గొట్టి ఇంట్లో సామగ్రి చిందరవందరగా పడేసి కన్పించాయి. బీరువాలోని తన భార్య పెట్టిన రూ.5000నగదు, ఓ జత వెండి పట్టీలు కన్పించలేదు. దొంగలు పడి తమ నగదు, వెండి పట్టీలను ఎత్తుకెళ్లారని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థిని అదృశ్యంపై కేసు

అశ్వాపురం, మే13(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పాములపల్లి గ్రామానికి చెందిన పోడుతూరి కన్నయ్య కుమార్తె పూజశ్రీ(19) అదృశ్యమైన సంఘటనపై మంగళవారం అశ్వాపురం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పూజశ్రీ భద్రాచలంలోని సిద్ధార్థ ఒకేషనల్ కళాశాలలో కళాశాలలో చదువుతోంది. ఈనెల ఐదవతేదీన కాలేజీకి వెళుతున్నానంటూ ఇంటినుంచి వెళ్లి తిరిగిరాలేదు. విద్యార్థిని కోసం బంధువులు, తెలిసిన వాళ్లఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభ్యంకాక పోవటంతో కుటుంబ సభ్యులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ మధుప్రసాద్ కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వడ్డీ దందా.. నయా పంథా



- జిల్లాలో జోరుగా అక్రమ ఫైనాన్స్, అనధికారిక చిట్టీ వ్యాపారం
- తీసుకున్న వడ్డీ నగదుకు ఏకంగా ఆస్తుల రిజిస్ట్రేషన్లు
- చిట్టీల వ్యవహారంలో బ్యాంకు చెక్కులు, ప్రాంసరీ నోట్లే హామీ

ఖమ్మం, మే13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అక్రమవడ్డీ దందా తీరు ఏ మాత్రం మారడం లేదు. అత్యవసరంగా నగదు అవసరం ఉన్న వ్యక్తులే టార్గెట్‌గా ఈ దందా యథేచ్ఛగా సాగుతోంది. వడ్డీ వ్యాపారం చేసేవారు బాధితలు ఏదో ఒకటి తనఖా పెడితేనే నగదు ఇస్తున్నారు. గతంలో తనఖా రిజిస్ట్రేషన్లు చేయించుకుని పూర్తి నగదు చెల్లిస్తే తిరిగి రిజిస్ట్రేషన్లు చేసేవారు. అయితే తనఖా రిజిస్ట్రేషన్లు చేయించుకుంటే నగదు తీసుకున్న వ్యక్తులు కోర్టుకు వెళ్తే తమ లెక్కలన్నీ బయటకొచ్చే ప్రమాదం ఉందని గ్రహించిన వడ్డీ వ్యాపారులు తమ పంథా మార్చి ఏకంగా సేల్‌డీడ్‌లు రాయించుకోవడం మొదలు పెట్టారు. ఆ తర్వాత వడ్డీకి నగదు తీసుకున్న వారి నుంచి జరిగే చెల్లింపులు ఇతర వ్యవహారాలన్నీ తెల్లకాగితాల పైనే రాసుకుంటున్నారు. ఇలా చేయడం వల్ల ఎవరైనా పోలీసులను ఆశ్రయించినా, కోర్టుకు వెళ్లినా తాము కొనుగోలు చేశామనేందుకు ఆయా డాక్యుమెంట్లను చూపించి న్యాయపరమైన అంశాలను తెరపైకి తీసుకొస్తున్నారు. కొందరు వడ్డీ వ్యాపారులు ఎంవోయూ(మ్యూచువల్ అగ్రిమెంట్)లు ఉన్నా ఆస్తుల విలువలు పెరిగిన సందర్భంలో తాము అడిగినంత వడ్డీ చెల్లిస్తేనే తిరిగి ఆస్తులను రిజిస్ట్రేషన్ చేస్తామంటూ బాధితులపై బెదిరింపులకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల ఖమ్మం నగరంలో ఓ కుటుంబానికి చెందిన ఇంటిని దౌర్జన్యంగా ఖాళీ చేయించే అంశం పెద్ద సంచలనంగానే మారగా.. అది ఈ కోవకే చెందినట్టు సమాచారం.

పోలీసుల తనిఖీల్లో దందా బట్టబయలు..

నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు చిట్టీలు, అధిక వడ్డీలు, అక్రమ ఫైనాన్స్ గిరిగిరి వ్యాపారాలు నిర్వహించే వారి ఇళ్లలో సోమవారం ఏకకాలంలో 11చోట్ల ఖమ్మం పోలీసులు తనిఖీలు చేశారు. రూ.లక్షల విలువ చేసే 120 ఖాళీ బ్యాంకు చెక్కులు, 570 ప్రాంసరీ నోట్లు, 38 బాండ్లను స్వాధీనం చేసుకున్నారు. గత కొంత కాలంగా కొందరు చిట్టీల నిర్వాహకులు తమ కస్టమర్ల నుంచి సేకరించిన డబ్బును చెల్లించకుండా ఇబ్బందులకు గురి చేయడం, దౌర్జన్యాలు, దాడులు చేయడం వంటి ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో పోలీసులు ఈ చర్యలు చేపట్టారు. ఎన్నో సంవత్సరాల తర్వాత పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు ఖమ్మం పోలీసులు చేపట్టిన ఈ తనిఖీలతో జిల్లాలో జరుగుతున్న అక్రమ ఫైనాన్స్, అనధికారిక చిట్టీల నిర్వాహణ తీరు బహిర్గతమైంది. అయితే ఆయా వ్యాపారాలు నిర్వహించే వారు వడ్డీ వ్యాపారంలో ఆస్తులు రిజిస్ట్రేషన్ చేయించుకుని దర్జాగా హక్కులు పొందుతుండగా చిట్టీలు వేసి నగదు తీసుకున్న వారి నుంచి ఖాళీ బ్యాంకు చెక్కులు, ప్రాంసరీ నోట్లపై సంతకాలు తీసుకుంటున్నట్టుగా తెలుస్తోంది. అయితే ఆయా నగదు లావాదేవీలు మాత్రం కాగితాలపై రాసుకున్న వ్యవహారం పోలీసుల దృష్టికి వచ్చినట్టు తెలుస్తోంది.

కోకొల్లలుగా అనధికారిక చిట్టీలు

జిల్లాలో అనధికారిక చిట్టీలు వేల సంఖ్యలో నడుస్తున్నాయి. ఒక్కో వీధికి పదుల సంఖ్యలోనే చిట్టీల నిర్వాహకులు ఉంటున్నారు. ఆయా వ్యక్తులు వేసే చిట్టీలలో ఎలాంటి నిబంధనలు పాటించకపోగా అసలు ఎవరి దగ్గర ఎంత నగదు వసూలు చేస్తున్నారో కూడా తెలియకుండా చిట్టీలు నిర్వహిస్తున్నారు. రూ.కోట్లలో అనధికారిక చిట్టీలు నిర్వహించే వారు జిల్లాలో ఎంతోమంది ఉన్నారు. అనధికారిక చిట్టీలకు సంబంధించి ఎవరైనా నగదు పాడుకుని సమయానికి చెల్లించకపోతే దానికి రెండింతలు వడ్డీ వేసి చెల్లించాలని బెదిరింపులకు పాల్పడటం పరిపాటిగా మారింది. ఎవరైనా చెల్లించకపోతే చిట్టీ నగదు ఇచ్చే సమయంలో తీసుకున్న ఖాళీ చెక్కులు, ప్రాంసరీ నోట్లను ఉపయోగించి పోలీసులను ఆశ్రయించడం, కోర్టు నుంచి నోటీసులు పంపడం సర్వసాధారణంగా మారింది. ఇలా అనధికారికంగా చిట్టీలు నిర్వహించి చాలా మంది ఐపీలు పెట్టి ఇళ్ల నుంచి పరారైనవారూ ఉన్నారు. అలాంటి సందర్భాల్లో బాధితులు పోలీసులను ఆశ్రయించినా పెద్దగా ఉపయోగం ఉండడం లేదు.

ప్రభుత్వ ఆదాయానికి గండి

కొందరు వడ్డీ వ్యాపారులు తమ వద్ద ఎవరైనా అవసరాలకు డబ్బు తీసుకుంటే చట్టబద్ధం కాని వడ్డీ వసూలు చేస్తూ బాధితులను పీడిస్తున్నారు. కొన్నిసార్లు తీసుకున్న నగదు మొత్తంతో పాటుగా వడ్డీ చెల్లించినా వారికి ఆ నగదు సరిపోదు. నగదు చెల్లించడంలో ఆలస్యం జరిగితే ఇక అంతే సంగతులు.. వడ్డీ అసలుకు సమానమవుతుంది. రుణగ్రహిత ఆస్తులపై హక్కులు పొందిన అనంతరం రూ.10నుంచి రూ.30వడ్డీ వసూలు చేస్తున్న కొందరు వ్యాపారులు ఆయా ఆస్తుల విలువ పెరిగితే మాత్రం వాటిని తిరిగి ఇచ్చేందుకు అనేక కొర్రీలు పెడుతున్నారంటూ బాధితులు వాపోతున్నారు. అక్రమ వడ్డీ దందా సాగించేవారు ఎక్కడా ప్రభుత్వ నిబంధనలు పాటించకపోవడంతో ప్రభుత్వానికి ఎలాంటి పన్ను చెల్లించడం లేదు. కొందరు వడ్డీ వ్యాపారులు తనఖా ఆస్తులపై హక్కులు పొందిన తర్వాత వాటిని బ్యాంకుల్లో పెట్టి నగదు తీసుకొని బాధితుల డబ్బుతోనే మళ్లీ వడ్డీ దందా నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

తరుగు పేరుతో మిల్లర్ల దోపిడీ

- తేమ, తాలు పేరుతో దిగుమతి చేయకుండా కాలయాపన
- తరుగు నగదు ముందు చెల్లిస్తేనే దిగుమతి
- సిబ్బంది ఉన్నతాధికారులకు తెలిపినా ఫలితం శూన్యం
- దళారులే మెరుగు అంటున్న రైతులు



మిల్లర్ల దోపిడీని వివరిస్తున్న రైతులు

చంద్రుగొండ, మే 13 (ఆంధ్రజ్యోతి): తరుగు, తేమ పేరుతో గతంలో ధాన్యంలో కోత విధించిన మిల్లర్లు ఇప్పుడు కొత్తరకం దోపిడీకి పాల్పడుతున్నారు. కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు చేరిన ధాన్యంలో తేమ, తాలు ఉందని అందుకు రైతులు ముందుగానే తరుగు నగదును చెల్లిస్తేనే ధాన్యాన్ని దిగుమతి చేస్తున్నారు. ఈ వ్యవహారం కొంతకాలంగా గోప్యంగా సాగుతుండగా తుంగారం రైతుల ద్వార మంగళవారం వెలుగులోకి వచ్చింది.

బాధిత రైతులు పూజల దుర్గారావు, పూజల వెంకటేశ్వర్లు, ఆళ్ల వీరమ్మ, ఆళ్ల శ్రీను, పుచ్చకాయల వెంకటేశ్వర్లు, పసుపులేటి నరసింహరావు, ఆళ్ల ముత్తేశ్వరావుతో పాటు మరో ఐదుగురు రైతులకు చెందిన మూడు లారీల(2001) టిక్కీల ధాన్యాన్ని నిబంధనల మేరకు సిబ్బంది తనిఖీలు నిర్వహించి లక్ష్మీపురం, ఇల్లందు మిల్లర్లకు గత నెల 27న తరలించారు. వారం గడిచినా ఖాతాల్లోకి నగదు జమకాకపోవటంతో సిబ్బంది ద్వారా మిల్లర్లతో రైతులు మాట్లాడారు మీ ధాన్యంలో తేమ, తాలు ఉందని అందుకు టిక్కీ(40కిలోలు) 1.5 కిలోల తరుగు పోయిదని, అందుకు కిలోకు రూ. 23 చెల్లించాలని లేదంటే ధాన్యాన్ని దిగుమతి చేసుకోమని మిల్లర్లు రైతులకు తెలిపారు. ఈ విషయం స్థానిక సిబ్బంది ఉన్నతాధికారులకు తెలిపారు. అయినా ఫలితం లేకపోవటంతో చేసేదేమీలేక 13 మంది రైతులు కిలోకు రూ.23 చొప్పున ఫోన్ పే ద్వారా రూ.60 వేలను మిల్లర్లు ఇచ్చిన నెంబర్లకు పంపారు. కాగా కొందరు మిల్లర్లు ఎటువంటి తరుగు తీయకుండా ధాన్యాన్ని దిగుమతి చేసుకున్న విషయం తెలుసుకున్న రైతులు తమకు జరిగిన అన్యాయాన్ని విలేకరుల ఎదుట ఏకరువు పెట్టారు. రైతులను దగా చేస్తున్న మిల్లర్లపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు. డిమాండ్ మేరకే రైతులు నగదు చెల్లించారని కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జ్ వెంకటేశ్వరావు తెలిపారు.

9.3 కిలోల గంజాయి పట్టివేత

భద్రాచలం, మే 13 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర, ఒడిసా సరిహద్దు అటవీ ప్రాంతం నుంచి భద్రాచలం మీదుగా ద్విచక్ర వాహనాలపై ఆంధ్రప్రదేశ్‌కు అక్రమంగా తరలిస్తున్న గంజాయిని మంగళవారం జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ టీం పోలీసులు పట్టుకున్నారు. గంజాయి అక్రమ రవాణా సమాచారం మేరకు కొత్తగూడెం ఎక్సైజ్ ట్రాస్ఫోర్స్ టీం భద్రాచలంలోని కూనవరం రోడ్డులో తనిఖీలు చేపట్టి అక్రమణ రవాణా గుర్తించి ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద ద్విచక్రవాహనాలు ఎండుగంజాయిని, రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. గంజాయి తూకం వేయగా 9.3 కిలోలు ఉన్నట్లు, దాని వీలువ రూ.4.66లక్షలుగా నిర్ధారించారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

కల్లూరు/ కరకగూడెం, మే 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెద్దకోరుకొండి గ్రామంలో సోమవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కోమటి లాజరు గాయపడ్డాడు. ద్విచక్రవాహనంపై వస్తుండగా గేదెలు అడ్డు రాగా అదుపుతప్పి పడిపోయాడు. ఈ సంఘటనలో లాజరు గాయపడ్డాడు.

కరకగూడెం మండలంలోని మోతే గ్రామంలో మంగళవారం అదుపుతప్పి ద్విచక్ర వాహనంపై నుంచి కింద పడటంతో చొప్పాల గ్రామానికి చెందిన ఆర్ఎంపీ గిద్దె క్రిష్ణకు తీవ్ర గాయాలయ్యాయి.

ప్రశాంతంగా పాలీసెట్

- ఖమ్మం జిల్లాలో 2,804 మందికి 2,556 మంది విద్యార్థుల హాజరు
- భద్రాద్రి జిల్లాలో 3,352 మందికి 3,117 మంది హాజరు



కొత్తగూడెంలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

ఖమ్మం ఖానాపురంహవేలి/ కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, మే 13(ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ కళాశాలలో చేరటానికి కామన్ ఎంట్రన్స్ టెస్ట్ పాలీసెట్ మంగళవారం ఖమ్మం, భద్రాది కొత్తగూడెం జిల్లాల్లో ప్రశాంతంగా నిర్వహించామని ఖమ్మం నగర పాలీసెట్ కోఆర్డినేటర్, ఎస్ఆర్ బీజీ ఎన్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మొహ్మద్. జాకీరుల్లా తెలిపారు. నగరంలో ఐదు పరీక్షా కేంద్రాల్లో మొత్తం 2,804 మంది విద్యార్థులకుగాను 2,556 మంది పరీక్షలకు హాజరయినట్లు తెలిపారు. ఈ పరీక్ష ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1:30గంటల వరకు నిర్వహించారు. విద్యార్థులు పరీక్ష సమయానికి గంట ముందుగా చేరుకోవటంతో కేంద్రాల వద్ద సందడి వాతావరణం నెలకోంది. విద్యార్థులను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం పరీక్షా కేంద్రాలలోకి అనుమతించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా 11 కేంద్రాలలో జరిగిన పరీక్షకు 3,117 మంది అభ్యర్థులు హాజరు కాగా 235 మంది గైర్హాజర య్యారు. కొత్తగూడెం సింగరేణి మహిళా జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రం వద్దకు వచ్చిన ఓ పరీక్ష అభ్యర్థి తన పరీక్షా కేంద్రం ఇది కాదని ఆంధోళనకు గురయ్యాడు. దీంతో అక్కడే విధుల్లో ఉన్న కొత్తగూడెం వన్‌టౌన్ సీఐ కరుణాకర్ ఆ అభ్యర్థిని ప్రియదర్శిని కళాశాల పరీక్షా కేంద్రానికి తన వాహనంలో తీసుకెళ్లారు. పరీక్షలను జిల్లా పాలిసెట్ కో-ఆర్డినేటర్ బండి శ్రీనివాస్ పర్యవేక్షించారు.

ఐదు ఎకరాల మక్క కంకులు దగ్ధం



కాలిపోయిన మొక్కజొన్న కంకులు

గుండాల, మే 13(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు కంకుల రాశికి నిప్పంటుకొని ఐదు ఎకరాల మొక్కజొన్న కంకులు దగ్ధమైన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని నర్సాపురం తండాకు చెందిన మాలోత్ హేమ అనే రైతు యాసంగి పంటగా ఐదు ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశాడు. ఇటీవల కోసిన కంకులను మిల్లర్ పట్టించేందుకు కల్లంలో ఆరబోశాడు. మంగళవారం తెల్లవారు జామున పక్కన కోతకోసిన చేనుకు అంటుకున్న మంటలు కల్లంలోని కంకుల రాశికి అంటుకున్నాయి. దీంతో రాశిగా పోసిన ఐదు ఎకరాల మొక్కజొన్న కంకులు పెద్దమొత్తంలో కాలిపోయాయి. ఉదయాన్నే చేనుకు వెళ్లిన రైతు దగ్ధమైన కంకులను చూసి బోరున విలపించారు. పంటతో పాటు కోసేందుకు సిద్ధంగా ఉన్న చేను, సాగునీటికోసం అమర్చిన పైపులు కాలిపోయాయి. సుమారు రూ. 1.50లక్షల వరకు నష్టం వాటిల్లిందని రైతు వాపోతున్నాడు. అధికారులు తమకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.

గడ్డివాము దగ్ధం

కల్లూరు, మే13(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చెన్నూరు గ్రామంలో మంగళవారం ప్రమాదవశాత్తు జరిగిన అగ్ని ప్రమాదంలో ఓ రైతుకు సంబంధించిన 5ఎకరాల వరి గడ్డివాము దగ్ధమైంది. చెన్నూరులోని రైతు గంతోటి రామారావు ఇంటి ముందు ఉన్న గడ్డివాముకు మధ్యాహ్నం 1గంట సమయంలో ప్రమాదవశాత్తు నిప్పంటుకొని పూర్తిగా దగ్ధమైంది. ఈ సమయంలో స్థానికులు అందించిన సమాచారంతో సత్తుపల్లికి చెందిన అగ్నిమాపకదళ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలు ఆర్పినారు. తన సొంత పొలంతో పాటుగా కొంత మేరకు కౌలుకు తీసుకున్న పొలంలో వరి గడ్డి ఈ ప్రమాదంలో దగ్ధమైందని బాధిత రైతు చెప్పారు.

మెరుగైన బోధనకు కార్యాచరణ

- ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



మాట్లాడుతున్న కలెక్టర్

ఖమ్మం ఖానాపురంహవేలి, మే 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో చదివేందుకు వచ్చే విద్యార్థులకు మెరుగైన విద్యా బోధన అందించేందుకు పటిష్ఠ కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. మంగళవారం నగరంలోని హార్వెస్ట్ పాఠశాలలో ఉపాధ్యాయులకు నిర్వహించిన వేసవి శిక్షణా కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. విద్యా శాఖలో ఒకే రోజు మార్పు సాధ్యం కాదని, నిర్విరామంగా ప్రయత్నం జరుగుతూ ఉండాలన్నారు. ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న వారికి ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే నిరుపేద రైతులు, కూలీలు, బడుగు బలహీన వర్గాల కుటంబాల నుంచి వచ్చే పిల్లల జీవితాలను బాగు చేసే అవకాశం లభిస్తుందని అన్నారు. చిన్నతనంలో విజయలక్ష్మి అనే ఉపాధ్యాయురాలు తీసుకున్న ప్రత్యేక శ్రద్ధ కారణంగానే తాను ఈ రోజు ఐఏఎస్ అధికారి స్థాయికి ఎదిగానని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఎంవో రాజశేఖర్, ఏఎంవో రవికుమార్, ఎంఐఎస్ రామకృష్ణ, హార్వెస్ట్ పాఠశాల కరస్పాండెంట్ రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతీరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల పరిశీలన పూర్తిచేయాలి

- భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి. పాటిల్

కొత్తగూడెం, మే 13 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించే దిశా ప్రభుత్వం చేపట్టిన రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల పరిశీలన రెండు రోజుల్లో పూర్తి చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లాలో రాజీవ్ యువవికాసం, ఇందిరమ్మ ఇళ్లు, జల్ సంచయ్ జెన్, భాగీదారి అమలుపై ఐటీడీఏ పీవో రాహుల్‌తో కలిసి సంబంధిత అధికారులతో టెలీకాన్ఫరెన్స్ ద్వార సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాజీవ్ యువ వికాసం పథకం వచ్చి వచ్చిన దరఖాస్తుల పరిశీలన వేగవంతంగా పూర్తి చేసి అర్హులైన వారి జాబితా రూపొందించాలన్నారు.

నూతన ఓసీల్లో ఉత్పత్తి ప్రారంభించాలి: సీఎండీ

ఇల్లెందుటౌన్, మే 13(ఆంధ్రజ్యోతి): ఇల్లెందు ఏరియాలో ప్రారంభించనున్న జేకే ఓసీ మైన్ ఉపరితల గని పనులను త్వరితగతిన పూర్తి చేసి బొగ్గు ఉత్పత్తి ప్రారంభించేలా చర్యలు చేట్టాలని సింగరేణి సీఎండీ బలరామ్‌నాయక్ స్పష్టం చేశారు. మంగళవారం ఇల్లెందు ఏరియాలో విస్తృతంగా పర్యటించారు. కోయగూడెం ఓసీ, ఇల్లెందు జేకే-5 ఓసీలను సందర్శించి బొగ్గు ఉత్పత్తి రక్షణ తదితరల అంశాలపై అధికారులతో సమీక్షించారు. నూతనంగా ప్రారంభించనున్న జేకే ఓసీ ప్రాంతమైన పూసపల్లిలో పర్యటించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి డైరెక్టర్లు సత్యనారాయణ రావు, కే. వెంకటేశ్వర్లు, ఎల్‌పీ సూర్యనారాయణ, ఏరియా జీఎం వి. కృష్ణయ్య, ఎస్ఓటు జీఎం రామస్వామి, కృష్ణమోహన్‌రావు, జీవీ మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.



రేపటి నుంచి క్రికెట్ పోటీలు ప్రారంభం

ఏన్కూరు, మే13(ఆంధ్రజ్యోతి): ఏన్కూరులో 8 మండలాల స్థాయి క్రికెట్ పోటీలు స్థానిక జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో 15నుంచి నిర్వహించనున్నట్టు ఆహ్వాన కమిటీ మంగళవారం ఒకప్రకటనలో తెలిపింది. ఏన్కూరు, కొణిజర్ల, కారేపల్లి, కామేపల్లి, తల్లాడ, వైరా, జూలూరుపాడు, చండ్రుగొండ మండలాల క్రీడాకారులు అర్హులని తెలిపారు. గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతి రూ.25వేలు, ద్వితీయ బహుమతి రూ.17వేలు, తృతీయ బహుమతి రూ.15 వేలు బహుమతులు అందిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఎంట్రీలను ఈనెల14లోపు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. 96525 13519, 96661 18620, నెంబర్లను సంప్రదించాలని కోరారు.

కార్పొరేషన్ ఎన్నికలకు టీడీపీ సన్నద్ధం

» టీడీపీ పార్లమెంట్ కన్వీనర్ వాసిరెడ్డి రామనాథం



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం, మే 13 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికల నాటికి ఖమ్మం నగరంలో తెలుగుదేశం పార్టీని సన్నద్ధం చేస్తున్నట్లు పార్లమెంట్ కన్వీనర్ వాసిరెడ్డి రామనాథం, నియోజకవర్గ కన్వీనర్ కూరపాటి వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గంలోని త్రీ టౌన్, వన్ టౌన్ డివిజన్ల సమావేశాన్ని గుమస్తాల సంఘ భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖమ్మం నియోజకవర్గంలో టీడీపీ బలం చెక్కుచెదరలేదన్నారు. పార్టీ అభిమానులు, శ్రేయోభిలాషులు అంతర్గతంగా పార్టీకి కృషి చేస్తున్నారని అన్నారు. వారందని సహకారంతో ఈ సారి కార్పొరేషన్ ఎన్నికల్లో పోటీకి సన్నద్ధం అవుతున్నట్లు తెలిపారు. కార్యకర్తలు కూడా పార్టీ పటిష్టానికి ఐక్యంగా కృషి చేయాలని వారు కోరారు. ఈ సమావేశానికి ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ డాక్టర్ వాసిరెడ్డి రామనాథం, నియోజకవర్గ పరిశీలకులు కాపా కృష్ణమోహన్, ఖమ్మం పార్లమెంట్ అడ్హక్ కమిటీ సభ్యులు వడ్డెం విజయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల డివిజన్ కమిటీల కోసం ప్రతిపాదనలను తీసుకున్నారు. తొలుత పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారకరామారావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులుగుత్తా సీతయ్య, మందడపు సుధాకర్, గుండె పిన్ని నాగేశ్వరావు, నాగండ్ల మురళి, ప్యారిస్ వెంకన్న, బాతరాజు కనకయ్య, తాళ్లూరి శ్రీనివాస్, గుడిపూడి నాగేశ్వరావు, డివిజన్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

అప్రమత్తతతో పని చేయాలి: డీఈ



సమావేశంలో మాట్లాడుతున్న డీఈ నాగేశ్వరరావు

ఖమ్మం రూరల్, మే 13(ఆంధ్రజ్యోతి): ప్రాణం ఎంతో విలువైనదని..అప్రమత్తతో పనిచేయాలని అందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డీఈ నాగేశ్వరరావు అధికారులకు సూచించారు. మంగళవారం ఏదులాపురం మునిసిపాలిటీ పరిధిలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రాణం కంటే ఏది విలువైనది కాదని, విద్యుత్ మరమ్మతులలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సిబ్బంది ఒకరికొకరు సమాచారం ఇచ్చుకుని ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షాల కారణంగా విరిగిన విద్యుత్ స్తంభాలను పట్టుకోవడం వల్ల ప్రమాదాలకు గురైయ్యే అవకాశం ఉందన్నారు. విద్యుత్ ప్ర మాదాలపై ప్రజలను చైతన్యం చేయాలన్నారు. అనుమతులు లేకుండా ఫ్యూజులు మార్చడం సర్వీసు వైర్లు వీది దీపాలను సరిచేయడం వల్ల ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందన్నారు. విద్యుత్ శాఖ సిబ్బంది తగు జాగ్రతలు తీసుకుంటూ గ్రామాల్లో విద్యుత్ వినియోగదారులకు, రైతులకు సూచనలు చేయాలని సిబ్బందికి ఆదేశించారు. ఈ సమావేశంలో ఏడీ రామకృష్ణ, ఏఈలు రామారావు, వినీల, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుడు ప్రసాద్ మృతి



ప్రసాద్(ఫైల్)

తిరుమలాయపాలెం, మే13(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్లచెరువు గ్రా మానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ మండల నాయకుడు జోగుపర్తి ప్రసాద్(65) గుండెపోటుతో సోమవారం మృతిచెందాడు. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలున్నారు. అయన భార్య మంగమ్మ గతంలో టీడీపీ ఎంపీటీసీగా గెలుపొందారు. ఆయన భౌతికకాయాన్ని మంగళవారం ఖమ్మం మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు, సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, డీసీసీబీ డైరెక్టర్ చావా వేణు, బీఆర్ఎస్ నాయకులు కొండబాల వెంకటేశ్వర్లు, ఓర వెంకటేశ్వర్లు, బెల్లం వేణు, కాంగ్రెస్‌నాయకులు సండ్ర వెంకటేశ్వర్లు తదితరులు నివాళులర్పించారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

» సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు బుగ్గవీటి సరళ

ఖమ్మం రూరల్, మే 13(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా మే 20న జరిగే సార్వతిక సమ్మెను విజయవంతం చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ స భ్యురాలు బుగ్గవీటి సరళ పిలుపునిచ్చారు. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో గల తమ్మినేని సుబ్బయ్య భవన్‌లో మంగళవారం జరిగిన మం డల కమిటీ జనరల్‌బాడీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభు త్వం ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలు కోసం పోరాటం చేస్తామన్నారు. సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఒక్కరూపాయి లేదు అని చెబుతున్న సీఎం అందాల పోటీలకు రూ.వందల కోట్లు ఏవిధంగా ఖర్చు చేస్తున్నారని ప్రశ్నించారు. పీడిత ప్రజల ప్రియతమ నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి ని ఈ నెల 19న అన్ని గ్రామాల్లో నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు నండ్రా ప్రసాద్, ఎస్.కే.బషీరుద్దీన్, మండల కార్యదర్శి సుదర్శన్ రెడ్డి, నాయకులు పి.నంగయ్య, మోహన్‌రావు, పెద్ద వెంకటరెడ్డి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కూసుమంచిలో పోస్టర్ ఆవిష్కరణ

కూసుమంచి మండల కేంద్రంలో భవన నిర్మాణ కార్మికుల అడ్డా కేంద్రంలోని భవన నిర్మాణ కార్మికులు సార్వత్రిక సమ్మెపోస్టర్‌ను మంగళవా రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రమణ, జిల్లా ఉపాధ్యక్షుడు మేడికొండ నాగేశ్వరరావు, గౌరవ సలహదారు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారాల కోసం అనేక పోరాటాలు చేస్తున్నప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కార్మికుల పట్ల అనుసరిస్తున్న విధానాన్ని వెంటనే విడనాడలని కోరారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శేషయ్య, శ్రీనివాస్, ఉపేంద్రచారి తదితరులు పాల్గొన్నారు.

సరస్వతి నదీ పుష్కరాలకు ఆర్టీసీ బస్సులు

ఖమ్మం ఖానాపురంహవేలి, మే 13(ఆంధ్రజ్యోతి): ఈ నెల 15 నుంచి 26 వరకు నిర్వహించనున్న సరస్వతి నదీ పుష్కరాలకు ఉమ్మడి ఖమ్మం జిల్లాల పరిధిలోని భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశామని ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సరిరాం మంగళవారం తెలిపారు. ఖమ్మం రీజనల్ పరిధిలో ఖమ్మం, కొత్తగుడెం, మణుగురు డిపోల నుంచి కాళేశ్వరం పుష్కర ఘట్‌లకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. ఈ ప్రత్యేక బస్సులు పుష్కరం మొదటి రోజు నుంచి 12 రోజుల పాటు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ ప్రత్యేక బస్సులలో రిజర్వేషన్ సౌకర్యం అందుబాటులో ఉం టుందని తెలిపారు. ఖమ్మం నుంచి పెద్దలకు రూ.480, పిల్లలకు రూ.260, మణుగూరు నుంచి పెద్దలకు రూ.450, పిల్లలకు రూ.240, కొత్తగుడెం నుంచి పెద్దలకు రూ.560, పిల్లలకు రూ.300ల చార్జీ ఉంటుందని తెలిపారు. ప్రయాణికుల రద్దీని బట్టి అదనపు సర్వీసులను ఏర్పాటు చేస్తామని తెలిపారు.

పాడి పశువుల యూనిట్ల గ్రౌండింగ్ చేయాలి

» కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం కలెక్టరేట్, మే 13(ఆంధ్రజ్యోతి): ఇందిరా మహిళా డెయిరీ కింద జూలై 15 తర్వాత ప్రతి వారం 250 పాడి పశువుల యూనిట్లు గ్రౌండ్ చేసేలా ప్రణాళిక రూపకల్పన చేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. మంగళవారం కలెక్టర్ తన క్యాంపు కార్యాలయంలో ఇందిరా మహిళా డెయిరీ నిర్వహణపై అధికారులతో సమీక్షించారు. పాడి రైతులకు పశువుల యూనిట్ గ్రౌండింగ్, ప్రస్తుతం ఎన్ని యూనిట్లు చేయాలి, ఎక్కడి నుంచి కొనుగోలు చేయాలి లాంటి అంశాలపై కలెక్టర్ చర్చించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాడి పశువుల కొనుగోలు ప్రక్రియ జూలై 15 తర్వాత ప్రారంభించాలన్నారు. ప్రతి నెలా ఎన్ని పాడి పశువులు కొనుగోలు చేయాలో ప్రణాళిక తయారు చేసుకోవాలని అన్నారు. జనవరి వరకు 5 వేల యూనిట్ల పాడి పశువులను గ్రౌండ్ చేసేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. పాడి పశువులకు అవసరమైన మేత కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని, వీటి తయారీ కోసం నిరుపయోగంగా ఉన్న అసైన్డ్ ప్రభుత్వ భూములను గుర్తించి వాటిని పశువుల మేతకు అవసరమైన గడ్డి పెంపకానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో సన్యాసయ్య, జిల్లా బీసీ సంక్షేమ అధికారి జి. జ్యోతి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నవీన్ బాబు, మైనార్టీ సంక్షేమ అధికారి డాక్టర్. పురందర్, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారిణి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఘనంగా సుదర్శన యాగం



అలంకరణలో లక్ష్మీనరసిహ స్వామి

ఖమ్మం ఖానాపురం హవేలి, మే 13(ఆంధ్రజ్యోతి): నగరంలోని స్తంభాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయ వార్షిక పంచాహ్నిక బ్రహ్మోత్సవాలు ముగిశాయి. మంగళవారం ఉదయం పానకాభిషేకం, విశేషపూజ, బాలభోగ నివేదన, వసంతోత్సవం, చక్ర స్నానం, సుదర్శన యాగం నిర్వహించారు. సాయంత్రం ద్వాదశ ప్రదక్షిణలు, ధ్వజ అవరోహణం, రాత్రి ఊం జల్ సేవ, దంపత్ తాంబూలం ఫలదానం నిర్వహించారు. ఆలయ ప్రధా న అర్చకులు నరహరి నర్సింహచార్యులు, రామకృష్ణా చార్యులు, శ్రీనివాసచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాలు, మధ్య సుదర్శన యాగం నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కార్యనిర్వాహణ అధికారి కొత్తూరు జగన్ మోహన్‌రావు ప్రత్యేక ఏర్పాట్లు చేశా రు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

మున్నేరు ముంపు ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలి

» కమిషనర్ అభిషేక్ అగస్త్య



మాట్లాడుతున్న కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మం సంక్షేమ విభాగం, మే 13(ఆంధ్రజ్యోతి): మున్నేరు ముంపు ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య పేర్కొన్నారు. మంగళవారం కేఎంసీ విభాగాల బాధ్యతలు, వార్డు ఆఫీసర్లతో కమిషనర్ సమావేశం చేపట్టారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మున్నేరు వాగుకు వరద ముంపు ప్రజల అప్రమత్తతపై ముందస్తు వ్యూహంతో జాగ్రత్తగా పనిచేయాలని ఆదేశించారు. ఇందు కోసం వరదలు రాకముందే కార్యచరణ చేసుకోవాలన్నారు. కేఎంసీలోని 20 మంది వార్డు ఆఫీసర్ల, ముంపు డివిజన్లకు బాధ్యతలు తీసుకోవాలని, ముందస్తుగానే డివిజన్లు వారీగా స్వచ్ఛంద వాలంటీర్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇళ్లు మునిగిపోయే ప్రాం తాల వారికి పూర్తి స్థాయిలో అవగాహన కల్పిచాలని ఆదేశించారు. ముందస్తు జాగ్రత్తలో భా గంగా ఖమ్మంలోని 16, 17, 28, 29, 30, 34, 35, 46, 47, 48, 59, 60 డివిజన్‌లకు వరద ముంపు పర్యవేక్షణా ప్రత్యేక అధికారులను కమిషనర్ అభిషేక్ అగస్త్య నియామకం చేశారు. ఇప్పటి నుంచి మున్నేరు వరద ముంపు డివిజన్లపై అప్రమత్తంగా ఉండాలన్నారు. గతేడాది ముంపు డివిజన్లలో ఏ మేరకు వరద తీవ్రత పెరిగిందనే అంచనాలను తెలుసుకొని ఆ ప్రాం తంలోని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

వరదల సమయంలో కేఎంసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే సూచనలపై ముందుగానే తెలియజేయాలని సూచించారు. వారం లోగా మున్నేరు వరద ముంపు డివిజన్‌ల్లో స్థానిక కార్పొరేటర్‌తో సమన్వయంచేసుకొని వాట్సాప్ గ్రూప్‌లు ఏర్పాటు చేయాలని, క్షేత్రస్థాయిలో వరద అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కమిషనర్ ఆదేశించారు.

సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యం వహించొద్దు

» ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాలోమన్

ఖమ్మం ఖానాపురంహవేలి, మే 13(ఆంధ్రజ్యోతి): ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలను కల్పించాలని, ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సొలోమన్ అన్నారు. మంగళవారం ఖమ్మం నగరంలోని సీటీ బస్టాండ్, నూతన బస్టాండ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికుల సంతృప్తి, సంస్థ అభివృద్ధే ప్రధాన లక్ష్యాలుగా తీసుకొని పనిచేయాలని అధికారులను ఆదేశించారు. ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం రీజినల్ మేనేజర్ సరిరాం, డిపో మేనేజర్ దినేష్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.



నూతన బస్టాండ్‌ను పరిశీలిస్తున్న ఈడీ సాలోమన్

సీబీఎస్ఈ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

ఖమ్మం మార్కెట్, మే 13(ఆంధ్రజ్యోతి): సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ) మంగళవారం విడుదల చేసిన పదో తరగతి, 12వ తరగతి(ప్లస్‌టూ) ఫలితాలలో ఖమ్మం కేంద్రీయ విద్యాలయం విద్యార్థులు ఫలితాలు సాధించినట్లు కవీంద్రరాయ్ తెలిపారు. పదో తరగతిలో అనుముల తన్మయి 478, జి. ఉర్మిలశ్రీ 463, బి.వీక్ష 453, పి.త్రినేత్ర 453, భూక్య మమత 450 సాధించారని తెలిపారు. ప్లస్‌టూలో హేమంత్‌కుమార్ 500 మార్కులతో టాపర్‌గా నిలిచినట్లు తెలిపారు. విద్యార్థులను ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

కేఎంసీ కమిషనర్‌తో ఎంపీ రఘురాంరెడ్డి భేటీ

ఖమ్మం సంక్షేమ విభాగం, మే 13 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్యతో ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి భేటి అయ్యారు. మంగళవారం కేఎంసీకి వచ్చిన ఎంపీ రైల్వే స్టేషన్ రోడ్డులోని సమస్యలను కమిషనర్‌కు తెలిపారు. రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని ఈ మేరకు తన వంతు సహకారం అందిస్తామన్నారు. రోడ్డు విస్తరణ సందర్భంగా బాధితులకు సరైన న్యాయం జరిగేలా చూడాలని కోరారు.

కుట్టు మిషన్ అందజేత



కుట్టు మిషన్‌ను అందజేస్తున్న రోటరీక్లబ్ సభ్యులు

నేలకొండపల్లి, మే13(ఆంధ్రజ్యోతి): నేలకొండపల్లికి చెందిన పేద మహిళ కందికొండ లక్ష్మీతిరుపతమ్మకు సింగారెడ్డిపాలెం ప్రాథమిక పాఠశాలలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో రోటరీ క్లబ్ కార్యదర్శి హరి శ్రీనివాస్ కుట్టు మిషన్‌ను అందచేశారు. ఈసందర్భంగా మండల విద్యాధికారి బాలిన చలపతిరావు మాట్లాడుతూ రోటరీక్లబ్ ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయురాలు కావూరి ఫణికుమారి పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

తిరుమలాయపాలెం, మే13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హస్నాబాదులో ఈ నెల 16న అంబేద్కర్ విగ్రహ ప్రతిష్ట సందర్భంగా ఏర్పాటు చేసిన పోస్టర్‌ను మంగళవారం ఎస్ఐ కె.జగదీష్, తహసీల్దార్ సుధీర్ ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో కమిటీసభ్యులు మాగి వెంకట్, యాతాకుల నాగేశ్వరరావు, మాగి లక్ష్మయ్యవెంకటయ్య, కొమ్ము శ్రీను తదితరులున్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్ఐ జగదీష్

ఇరువర్గాల ఘర్షణ

ఖమ్మం ఖానాపురంహవేలి, మే 13(ఆంధ్రజ్యోతి): నగరంలోని రైల్వేస్టేషన్ వద్ద గల ఓ టీ స్టాల్ నిర్వాహకుడు కొంత మంది యువకుల మధ్య ఘర్షణ జరిగిన సంఘటన సోమవారం అర్ధరాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం అర్ధరాత్రి కొందరు యువకులు టీ తాగేందుకు రైల్వేస్టేషన్ వద్ద గల టీ స్టాల్ వద్దకు వచ్చి టీ తాగి డబ్బులు చెల్లించే క్రమంలో టీ స్టాల్ నిర్వాహకుడికి, యువకులకు మధ్య మాట మాట పెరిగి ఘర్షణకు దారితీసింది. దీంతో కొందరు యువకులు వారి స్నేహితులకు ఫోన్ చేసి సంఘటన జరిగిన ప్రాంతానికి రమ్మని పిలువగా వారు వచ్చి హోటల్‌లోని సామగ్రిని ధ్వంసం చేసినట్లు తెలిపారు. సమాచారం అందుకున్న వన్‌టౌన్ పోలీసులు హోటల్ వద్దకు వచ్చి యువకులను అదు పులోకి తీసుకున్నారు. విషయం తెలుసుకోని సీఐ కరుణాకర్ స్టేషన్‌కు చేరుకోని యువకులను మదలించినట్లు సమాచారం.

స్థల పరిశీలన

ఖమ్మం రూరల్, మే 13(ఆంధ్రజ్యోతి): ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని గ్రామాలకు సంబంధించిన చెత్తను తరలించేందుకు డంపింగ్ యార్డ్ నిర్మాణంలో భాగంగా పల్లెగూడెం రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ స్థలాన్ని కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ రాంప్రసాద్, ఆర్ఐ ప్రసాద్‌లు మంగళవారం పరిశీలించారు.

కవులకు, కళాకారులకు పుట్టినిల్లు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఖమ్మం సాంస్కృతికం, మే 13 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం కళాకారుల గుమ్మమని పలువురు కళాకారులు వాఖ్యానించారు.. 23 సినిమా పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం మంగళవారం ఖమ్మంలోని భక్తరామదాసు క ళాక్షేత్రంలో జరిగింది. ఖమ్మం క ళాపరిషత్ అధ్యక్షుడు నాగబత్తిని రవి, ఏఆర్ఎస్‌పీఎస్ నరసయ్య, అంబేద్కర్ సంఘం నాయకులు లింగాల రవికుమార్, పల్లా రాజశేఖర్, విజయ డెయిరీ డీడీ మురళి మాట్లాడుతూ ఈ నెల 16న విడుదల కాబోతున్న ఈ చిత్రంలో స్థానిక జానపదగాయకుడు జాన్‌కు పాట పాడే అవకాశం దక్కడం హర్షనీయం అన్నారు. కార్యక్రమంలో కళాకారులు మిమిక్రీ సుధాకర్, పాగి వెంకన్న, నందిగామ జాన్, మట్టె గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బంగారం, వెండి చోరీ

ఖమ్మం ఖానాపురంహవేలి, మే 13(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఖానాపురంహవేలి నూతన కాలనీలో సోమవారం అర్ధరాత్రి ఓ ఇంటి తాళం పగులకొట్టి ఇంటిలోని బంగారం, వెండి వస్తువులతో పాటు కొంత నగదును చోరీ చేసిన సంఘటన జరిగింది. స్థానికులు, ఇంటి యజమాని తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం రాత్రి 11 గంటల సమయంలో ఇంటి యజమాని బానోత్ శోభన్, భార్య వనితలు తిరుపతికి వెళ్లారు. కాగా అదే రోజు అర్ధరాత్రి 3:30 నిమిషాలకు ఇంట్లోకి కొందరు దొంగలు ప్రవేశించి తాళాలు పగులకొట్టి ఇంట్లోకి చొరబడి ఇంట్లోని 36 తులాల బంగారం, 30తులాల వెండితోపాటు రూ.12వేల నగదును దొంగిలించారని తెలిపారు. మంగళవారం ఉదయం ఇంటి పక్కన వారు విషయం తెలుసుకోని ఇంటి యజమాని శోభన్‌కు ఫోన్‌లో సమాచారం అందించారు. దీంతో వారు తిరుపతికి చేరుకోవటంతో దర్శనం చేసుకోకుండానే తిరుగు ప్రయాణమయ్యారు. కాగా మంగళవారం రాత్రి 9గంటలకు ఖమ్మం చేరుకోని ఖమ్మం ఖానాపురంహవేలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని చేరుకోని ఇంట్లోని సీసీ కెమెరాలో నమోదైన ఫుటేజ్ ఆధారంగా వివరాలు సేకరించి కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

అదనపు ఆదాయానికి కార్యాచరణ

» ప్రత్యేక అధికారులు, కంప్యూటర్ ఆపరేటర్ల ఏర్పాటు

» పది రోజుల్లో పనుల పూర్తి కోసం ఆదేశాలు



ఖమ్మం సంక్షేమ విభాగం, మే 13 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగర పాలక సంస్థకు శాశ్వత ఆదాయ పెంపుపై కమిషనర్ అభిషేక్ అగస్త్య దృష్టి సారించారు. ఇందుకోసం రెవెన్యూ విభాగంలోని ముగ్గురు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లకు మూడు ఆదాయ విభాగాలకు ప్రత్యేక అధికారులుగా మంగళవారం నియామకం చేశారు. శాటిలైట్ ద్వారా భవనాలు కొలతలు లెక్కించే భువన్‌కు ప్రత్యేక అధికారిగా వజ్జా రామారావును కంప్యూటర్ అపరేటర్లుగా ఉపేందర్, సునీతలను కేటాయించారు. ఖమ్మం నగరంలో ఇప్పటి వరకు 9వేల భవనాల వరకు భువన్ ద్వారా కొలతలు తీసుకున్నారు. వాటిలో 5వేల పూర్తి చేశారు. మరో 4వేల భవన్ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని పది రోజుల్లో పూర్తి చేయాలని కమిషనర్ ప్రత్యేక ఆదేశాలిచ్చారు.

ఖమ్మం నగరంలోని రెవెన్యూలోని 11వ వార్డులో ప్రైవేట్ ఏజెన్సీ ద్వారా భవనాల లెక్కలు తెల్చారు. వాటిని అధికారికంగా ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలోకి ఆన్‌లైన్ చేసి నూతన లెక్కల మేరకు ప్రాపర్టీ ట్యాక్స్‌లు రికార్డు చేయాల్సి ఉంది. 1,200 వరకు అండర్ ఎసెస్‌మెంట్‌లో ఉండటంతో వాటి కోసం ప్రత్యేక అధికారిగా ఎం.శ్రీనివాసరావు కేటాయించారు. కంప్యూటర్ ఆపరేటర్లుగా శంకర్, సందీప్‌లను కేటాయించారు.

కేఎంసీ పరిధిలోని మిక్స్‌డ్ కమర్షియల్ ప్రాంతాలకు జ్యోతిని ప్రత్యేక అధికారిగా నియామకం చేశారు. కంప్యూటర్ అపరేటర్లుగా వినయ్, ప్రవీణ్‌లను కేటాయించారు. పై మూడు విభాగాల నుంచి రూ.2 కోట్ల మేరకు ప్రతి ఏడాది ఆదాయ పెంపుపై కమిషనర్ అభిషేక్ అగస్త్య కార్యాచరణ చేశారు. పది రోజుల్లో మూడు విభాగాలు నూరుశాతం లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు.



భూ సమస్యల సత్వర పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

బోనకల్, మే 13 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల సత్వర పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సుల నిర్వహిస్తున్నట్టు తహశీల్దార్ పున్నం చందర్ తెలిపారు. మండలంలోని రావినూతల, రాపల్లి గ్రామాల్లో మంగళవారం రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. రెండు గ్రామాల్లో రైతుల నుంచి 266 దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెండింగ్ భూ సమస్యలకు భూ భారతి ద్వారా పరిష్కారం లభిస్తుందన్నారు. రైతులు తమ సమస్యలకు సంబంధించి గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిర్దావర్ మైథిలి, సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి క్రికెట్ పోటీలు ప్రారంభం

ఏన్కూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): ఈనెల 15నుంచి ఏన్కూరు పట్టణంలో మండల స్థాయి క్రికెట్ పోటీలు స్థానిక జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించనున్నట్టు ఆహ్వాన కమిటీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఏన్కూరు, కొణిజర్ల, కారేపల్లి, కామేపల్లి, తల్లాడ, వైరా, జూలూరుపాడు, చంద్రుగొండ మండలాల క్రీడాకారులు అర్హులని తెలిపారు. గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతి రూ.25వేలు, ద్వితీయ బహుమతి రూ.17వేలు, తృతీయ బహుమతి రూ.15వేలు అందిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఎంట్రీలను ఈ నెల 14వ తేదీలోపు 9652513519, 9666118620, 9063991501 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

▸▸ మంత్రి పొంగులేటి

కారేపల్లి మే 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మాధారం గ్రామంలోని బుడిగజంగాలవారిలో అర్హులైనవారందరికి తప్పకుండిందిరమ్మ ఇండ్లుమంజూరుచేస్తానని రెవిన్యూమంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హామీ ఇచ్చారు.మంగళవారం మాధారం గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ అజ్మీర నరేష్ ఆధ్వర్యంలో పలువురు గ్రామస్థులు,బుడిజంగాలకువారు ఖమ్మం మంత్రి శ్రీనివాస్ రెడ్డి నివాసంలో కలిశారు.ఈసందర్బంగా అనేక సంవత్సరాలుగా గ్రామంలో నివాసం ఉంటున్నబుడిగ జంగాలు సొంతిండ్లు లేకపోవడంతో అనేక ఇబ్బందు పడుతున్నరని,వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరుచేయాలని కోరారు.ఈవిషయంపై స్పందించిన ఆయన అక్కడే ఉన్న కలెక్టర్‌తో మాట్లాడి అర్హులైనవారందరికి ఇండ్లుమంజూరుచేయని ఆదేశాలజారి చేసిన్నట్లు నరేష్‌నాయక్ తెలిపారు.అర్హులైనవారికి సంబంధించిన ద్రువీకరణపత్రాలను కలెక్టర్‌కు అందచేశారు.మంత్రి శ్రీనివాస్‌రెడ్డికి గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

యంగ్ ఇండియా పాఠశాల హద్దుల సర్వే పూర్తి



యంగ్ ఇండియా పాఠశాల హద్దులను గుర్తిస్తున్న సర్వే అధికారులు

బోనకల్, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీపురం రెవెన్యూ పరిధిలో గల 401 సర్వే నంబర్‌లో నూతనంగా నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణాలకు సంబంధించి మంగళవారం సర్వే డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ వెంకట్రావు ఆధ్వర్యంలో సర్వే బృందం హద్దుల గుర్తింపు పూర్తి చేశారు. రూ. 300 కోట్ల నిధులతో 30 ఎకరాల భూమిలో అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యను అందించేందుకు గానూ చేపడుతున్న భవన నిర్మాణ పనులకు భూమి హద్దులను గుర్తించారు. పనులలో జాప్యం లేకుండా తమ వంతుగా సర్వే పనులను పూర్తి చేశామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్ధార్ పున్నం చందర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కష్టపడి చదివే వారికి పేదరికం అడ్డుకాదు

బోనకల్, మే 13 (ఆంధ్రజ్యోతి): కష్టపడి చదివే వారికి పేదరికం అడ్డుకాదని మాజీ జడ్పీటీసీ బాణోతు కొండ తెలిపారు. బోనకల్ ఎస్సీ కాలనీలో మంగళవారం ఎంసెట్‌లో మంచి ర్యాంకు సాధించిన గుర్రం అఖిలను సన్మానించి, ప్రోత్సాహక బహుమతిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేద కుటుంబ నేపథ్యమైనా అఖిల కష్టపడి క్రమశిక్షణతో చదివి మంచి ర్యాంకు సాధించడం ఆదర్శప్రాయమన్నారు. ఉన్నత చదువులకు ఆర్థిక అవసరం ఉంటే సహాయం చేస్తామని హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మందా హైమావతి, అంతోటి ఆదినారాయణ, రవి ప్రసాద్, లక్ష్మీ, తెల్లూరి రమేష్, అంతోటి అంజయ్య, పవన్, మనోజ్ కుమార్, ఇరుగు పుల్లారావు, ఎర్ర శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీని నిక్కచ్చిగా అమలు చేయాలి

బోనకల్, మే 13 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామి పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘ మండల కార్యదర్శి బంధం శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మండలంలోని రాపల్లి, బ్రాహ్మణపల్లి, కలకోట గ్రామాల్లో మంగళవారం ఉపాధి హామి పథకం కింద పనిచేస్తున్న కూలీలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సీపీఎం పోరాటాల ఫలితంగానే ఉపాధి హామి పథకం అమల్లోకి వచ్చిందన్నారు. కేంద్ర ప్రభుత్వం మన రాష్ట్రానికిలో పథకం అమలుకు సరైన బడ్జెట్‌ను కేటాయించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పనుల్లో కోత విధించడం వల్ల కూలీలకు పని కల్పించడం కష్టతరంగా మారిందన్నారు. పని ప్రదేశాల వద్ద కూలీలకు అన్ని సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మిక సంఘ నాయకులు కొమ్మినేని పురుషోత్తం, శ్రీను, నర్సింహారావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు సమస్యను పరిష్కరించాలి

ముదిగొండ, మే 13 (ఆంధ్రజ్యోతి): ముదిగొండ మండలం ముత్తారం గ్రామంలో డబుల్‌బెడ్‌రూమ్స్‌కు వెళ్లే రోడ్డు సమస్యను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం తహశీల్దార్ సునీత ఎల్జిబెత్‌కు వినతిపత్రం అందజేశారు. ముత్తారంలో 20 డబుల్‌బెడ్‌రూం ఇళ్లు నిర్మించి రోడ్డును పోశారని కానీ కొందరు వ్యక్తులు ఆరోడ్డు స్థలం మాదేనని అడ్డగిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని వారు కోరారు. కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి

▸▸ సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి చలమల విఠల్‌రావు

సత్తుపల్లి, మే 13 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 20న దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మె జరుగుతుందని, సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి చలమాల విఠల్‌రావు పిలుపునిచ్చారు. కార్మిక, కర్షక, విద్యార్థి, సంఘటిత, అసంఘటిత రంగాల కార్మికుల సమస్యల పరిష్కారం కోసం దేశవ్యాప్త సమ్మె జరగనుందని చెప్పారు. మంగళవారం సత్తుపల్లిలో జరిగిన అఖిలపక్ష కార్మిక సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11 ఏళ్ల అయినా కార్మికుల సమస్యలు పరిష్కారం కాలేదని విమర్శించారు. శ్రామికుల వేతనాలు కూడా 20శాతం పడిపోయాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు కొలికపోగు సర్వేశ్వరరావు, ఏఐటీయూసీ నాయకుడు నిమ్మకూరి రామకృష్ణ, టీయూసీఐ నాయకుడు శరత్‌లు పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న విఠల్‌రావు

తల్లాడలో

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 20న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని టీయూసీఐ ఖమ్మంజిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏ.వెంకన్న, జి.రామయ్య కోరారు. తల్లాడలో మంగళవారం జరిగిన టీయూసీఐ ఏరియా కమిటీ విస్తృత సమావేశంలో వారు మాట్లాడుతూ.. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం అదాని, అంబానీలకు ప్రభుత్వ రంగ పరిశ్రమలను అప్పనంగా కట్టబెడుతుందని విమర్శించారు. ప్రభుత్వ రంగ పరిశ్రమలను ప్రైవేటీకరణ పేరుతో కార్పొరేట్ పెట్టుబడిదారీ వర్గాలకు కట్టబెట్టడంతో కార్మికులను ఉద్యోగాల నుంచి బలవంతంగా తొలిగిస్తున్నారని ఫలితంగా వారు ఉపాధి కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. కేజీబీవీ, అంగన్‌వాడీ, గ్రామపంచాయతీ కార్మికులు, ఆశా, అంగన్‌వాడీ వర్కర్లకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. దేశవ్యాప్తంగా ఈనెల 20న జరిగే సమ్మెలో సంఘటిత, అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ సమావేశంలో తల్లాడ , ఏన్కూరు ఏరియా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పటాన్ నాగుల్‌మీరా, డి.శ్రీనివాసరావు, జిల్లా కార్యవర్గ సభ్యుడు షేక్ లాల్‌మియా, ఏరియా కమిటీసభ్యులు జి.నాగయ్య, కిషోర్, టి.శ్రీను, బడేమియా, పుల్లారావు, రాఘవ, రమణ, వెంకటేశ్వర్లు , సత్యం పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కార్మిక సంఘ నాయకులు

మధిరటౌన్‌లో

కేంద్ర ప్రభుత్వం అనేక ఏళ్లగా అమలులో ఉన్న కార్మిక చట్టాల రద్దును ఉపసంహరించుకోవాలని కోరుతూ ఈనెల 20న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కార్మిక సంఘ నాయకులు కోరారు. మంగళవారం మధిరలోని రెడ్డి గార్డెన్స్ లో జరిగిన ఐఎన్‌టీయుసీ, ఎఐటీయుసీ, సీఐటీయు, బీఆర్‌ఎస్‌కేవి నాయకులు సమావేశమై కార్మిక చట్టాల రద్దుకు నిరసనగా ఈ నెల 20 నుంచి అన్ని సంఘాలు సమ్మెకు పిలుపునివ్వడం జరిగిందన్నారు. కార్మికుల పట్ల కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న నిరంకుశ విధానాలకు నిరసనగా సమ్మెకు దిగటం జరిగిందన్నారు. ఐఎన్‌టీయుసీ, ఎఐటీయుసీ, సీఐటీయు, బీఆర్‌ఎస్‌కేవి నాయకులు కోరంపల్లి చంటి, చెరుకూరి వెంకటేశ్వరరావు, శీలం నరసింహరావు, ఖాదర్ కాంగ్రెస్ నాయకులు సూరంశెట్టి కిషోర్, బీఆర్‌ఎస్ నాయకులు బొగ్గుల భాస్కర్‌రెడ్డి, సీపీఐ నాయకులు బెజవాడ రవి, సీపీఎం నాయకులు పావినేని రామనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.



అప్పయ్యను పరామర్శిస్తున్న భట్టి

సీనియర్ కాంగ్రెస్ నేతను పరామర్శించిన భట్టి

తల్లాడ, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లగూడెం గ్రామంలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, మాజీ సర్పంచ్ కాపా అప్పయ్యను మంగళవారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పరామర్శించారు. ఈ సందర్భంగా అప్పయ్య ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, తల్లాడ, వైరా మండల కాంగ్రెస్ అధ్యక్షులు కాపా సుధాకర్, శీలం వెంకటనర్సిరెడ్డి, కేతేపల్లి భాస్కరరావు పాల్గొన్నారు.

ఘనంగా స్వామివారి ఊరేగింపు

ఏన్కూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గార్లఒడ్డు శ్రీలక్ష్మీనరసింహాస్వామి దేవాలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం స్వామివారి ఊరేగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. నిత్య ఆరాధన, యాగశాల ఆరాధన, శ్రీ మహాలక్ష్మి ఇష్టపూర్ణాహుతి కార్యక్రమాలు జరిగాయి. సాయంత్రం 5గంటల నుంచి తిరువీధి ఉత్సవం కార్యక్రమాన్ని గ్రామంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని మిల్లులకు తరలించాలి

▸▸ అడిషనల్ కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

తల్లాడ, మే 13 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని అడిషనల్ కలెక్టర్ శ్రీనివాసరెడ్డి అధికరులను ఆదేశించారు. మంగళవారం తల్లాడ మండలం కుర్నవల్లిలోని సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డీఎస్‌వో చందన్‌కుమార్‌తో కలిసి ఆయన పరిశీలించారు. కుర్నవల్లిలో సొసైటీ ఆధ్వర్యంలోని కొనుగోలు కేంద్రంలో సన్నరకాల ధాన్యం 20వేల బస్తాలు , ఐకేపీ ఆధ్వర్యంలోని కొనుగోలు కేంద్రంలో మరో 30వేల బస్తాలు సాధారణ రకం ధాన్యం నాలుగైదు రోజుల క్రితం కాంటాలు వేసినప్పటికి మిల్లులకు తరలించడానికి లారీల కొరత ఉందని, పలువురు రైతులు అడిషనల్ కలెక్టర్ శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన స్పందించి ధాన్యాన్ని మిల్లలకు తరలించడానికి రోజుకు 15లారీలు చొప్పున పంపేందుకు ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు. మిగిలిన ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలని ఆయన ఆదేశించారు. ఇప్పటి వరకు తల్లాడ మండలంలో 1.20లక్షల మె.ట. ధాన్యం సేకరణ జరిగిందని, వీటిలో 50వేల మె.ట. ధాన్యం వరంగల్‌కు పంపుతున్నట్లు తెలిపారు. అనంతరం



ధాన్యాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్

తల్లాడలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో స్థానిక రైస్‌మిల్లర్లతో సమావేశం నిర్వహించి ప్రభుత్వం నిర్దేశించిన కోటా ప్రకారం రైస్‌మిల్లర్లు ధాన్యాన్ని దిగుమతి చేసుకోవాలన్నారు. ధాన్యంను తరగు లేకుండా దిగుమతి చేసుకోవాలని, ఇందుకు విరుద్ధంగా వ్యవహరించే మిల్లర్లపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయ్ డీఎం గంటా శ్రీలత, కల్లూరు ఆర్డీవో రాజేంద్రగౌడ్, తహశీల్దార్ సురేష్‌కుమార్, రైస్‌మిల్లర్ల అసోసియేషన్ జిల్లా కార్యదర్శి జవ్వాజి చిన్ననాగేశ్వరరావు పాల్గొన్నారు.

నాణ్యతతో పనులు పూర్తి చేయాలి

వైరా, మే 13 (ఆంధ్రజ్యోతి): వైరా నదిలో రూ.11కోట్ల పైచిలుకు నిధులతో చేపట్టిన రక్షణ గోడలు, చెక్‌డ్యాం నిర్మాణాలను నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వైరా నీటిపారుదలశాఖ డీఈ పి.శ్రీనివాస్‌ను ఆదేశించారు. వైరా మండలంలోని తమ స్వగ్రామం అయిన స్నానాల లక్ష్మీపురం వద్ద వైరా నదిలో చేపట్టిన రక్షణ గోడలు, చెక్‌డ్యాం, నిర్మాణాలను మంగళవారం భట్టి విక్రమార్క ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. వర్షాకాలం రాక ముందే ఈ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. అలాగే నాణ్యతలో రాజీ పడవద్దని స్పష్టం చేశారు. ప్రస్తుతం జరుగుతున్న పనులపై డీఈ శ్రీనివాస్‌తో సమీక్షించారు. అదే సమయంలో శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి పనులను కూడా పరిశీలించి ఆ పనులను కూడా త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, వైరా, కొణిజర్ల మండల కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, వడ్డే నారాయణ, వైరా ప్రాజెక్టు కమిటీ మాజీ ఛైర్మన్ దొడ్డా పుల్లయ్య, నాయకులు నూతి వెంకటేశ్వరరావు, గుగులోతు రాము, పొట్టపల్లి నాగేశ్వరరావు, రామకృష్ణ పాల్గొన్నారు.



అభివృద్ధి పనులపై సీఈతో సమీక్షిస్తున్న భట్టి విక్రమార్క

ప్రజలను మోసం చేస్తే ప్రభుత్వాన్ని నిలదీయక తప్పదు

మధిరరూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేయకుంటే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీయక తప్పదని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బెజవాడ రవిబాబు అన్నారు. మంగళవారం సీపీఐ మండల కార్యదర్శి ఊట్లకొండలరావు అధ్యక్షతన సీపీఐ మండల కౌన్సిల్ సమావేశం మధిర రెడ్డి గార్డెన్‌లో జరిగింది.. ఈ కౌన్సిల్ సమావేశంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమ్యలు వాటిపై పార్టీపరంగా తీసుకోవాల్సిన చర్యలు, పార్టీ బలోపేతానికి భవిష్యత్ కార్యచరణపై కౌన్సిల్ సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా బెజవాడ రవి బాబు మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలు ప్రతి పేదకుటుంబానికి చేరాలన్నదే కమ్యూనిస్టుపార్టీ అంతిమ లక్ష్యమన్నారు. అందుకోసం ప్రభుత్వంపై పోరాడేందుకు ఎప్పుడూ వెనుకాడబోమన్నారు. నాడు ఎన్నికల సందర్భంగా పార్టీ పరంగా ఇచ్చిన హామీలను గుర్తుచేశారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లానాయకులు ఎంఏ రహీం, ఏఐటీయూసీ డివిజన్ కార్యదర్శి చెరుకూరి వెంకటేశ్వరరావు, ఏఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు మడుపల్లి లక్ష్మణ్, తలారి రమేష్, ఊట్ల రామకృష్ణ, బ్రహ్మం, పున్నవెల్లి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పార్టీని బూత్‌లెవల్ నుంచి పటిష్టపర్చాలి

వైరా, మే 13 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీని బూత్‌స్థాయి నుంచి బలోపేతం చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ అబ్జర్వర్ బత్తిని శ్రీనివాసరావు స్పష్టం చేశారు. మంగళవారం వైరా నియోజకవర్గంలో పార్టీ సంస్థాగత నిర్మాణంపై ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించాలని అన్నారు. వైరా, ఏన్కూరు, కారేపల్లి, జూలూరుపాడ్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, స్వర్ణ నరేందర్, చంద్రప్రకాష్, మంగీలాల్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు వేముల కృష్ణప్రసాద్, అనుమోలు కృష్ణార్జున్‌రావు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సీతరాములు, నర్సింహారావు, అశోక్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడి ఎంపికపై కసరత్తు

కల్లూరు, మే 13 (ఆంధ్రజ్యోతి) కల్లూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుని ఎంపికపై సత్తుపల్లి నియోజవర్గ స్థాయిలో పార్టీ నాయకత్వం దృష్టి సారించింది. ఈ మేరకు మంగళవారం సత్తుపల్లి నియోజకవర్గ స్థాయిలో జరిగిన ఆ పార్టీ ముఖ్యుల సమావేశంలో నలుగురు పేర్లు పార్టీ పరిశీలకుడికి అందినట్లు సమాచారం. గత రెండు సంవత్సరాల నుంచి మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎవరు నాయత్వం వహించని పరిస్థితి. అసెంబ్లీ ఎన్నిలు ముగిసినప్పట్టి నుంచి కల్లూరు మండల కాంగ్రెస్ పార్టీకి అధ్యక్షుడు లేక నాయకత్వం లోపించింది. సత్తుపల్లి నియోజకవర్గ స్థాయిలో కాంగ్రెస్ పార్టీలో మండలాల వారిగా సామాజిక వర్గ సమీకరణలో బాగంగా తోటకూర శేషగిరిరావు, యర్రబోయినపల్లి గ్రామానికి చెందిన పోట్రు అర్జునరావు, లింగాల నుంచి ఏనుగు సత్యంబాబు, తక్కేళ్లపాటి ప్రసాద్ పేర్లు మండల కాంగ్రెస్ అధ్యక్షునిగా ఎంపిక చేసే విషయంలో పరిశీలనలో ఉన్నట్లు తెలిసింది. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్నందున పార్టీని బలోపేతం చేసే ప్రక్రియ జరుగుతోంది. నియోజకవర్గ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ నాయకత్వం మండల అధ్యక్షుడి ఎంపికపై ప్రత్యేక దృష్టి సారించింది. ఈ వారం లోగా ఈ ప్రక్రియ పూర్తి చేయాలని నిర్ణయించినట్లు కాంగ్రెస్ పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. ఈ కసరత్తులో అధిష్టానం నిర్ణయమే అంతిమం.

ప్రజలకు దూరంగా.. డివిజన్ కార్యాలయాలు

ఏన్కూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): పరిపాలన సౌలభ్యం కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2019లో కొత్త జిల్లాలను ఏర్పాటుచేసింది. అయితే ఏన్కూరు మండలం ఎప్పటిలాగే ఖమ్మం జిల్లాలోనే ఉంది. జిల్లాల పునర్విభజన తర్వాత ఏన్కూరు మండల ప్రజలకు కొత్త సమస్యలు తలెత్తాయి. డివిజన్ కార్యాలయాలను అస్తవ్యస్థంగా మార్చారు. దగ్గరగా ఉన్న కార్యాలయాలను దూర ప్రాంతాలకు మార్చారు. దీంతో కార్యాలయాలకు వెళ్లి రావడానికి దూరాభారం పెరిగి ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. అతిసమీపంలోని వైరా కాకుండా సత్తుపల్లికి కార్యాలయాలను మార్చడం వల్ల మండల ప్రజలు అసహనం వ్యక్తంచేస్తున్నారు. ఈ విషయంపై అనేకసార్లు ఆందోళన చేసినా ఫలితం లేదు. ఉమ్మడి జిల్లాగా ఉన్నప్పుడు ఆర్డీవో, ఆర్టీవో, లేబర్, ఇన్సూరెన్సు డీఎస్పీ కార్యాలయాలు కొత్తగూడెంలో, సర్కిల్ కార్యాలయం జూలూరుపాడులో ప్రజలకు



అందుబాటులో ఉండేది. నూతన జిల్లాల ఏర్పాటు తర్వాత ఆ కార్యాలయాలను మార్చారు. ఆర్డీవో కార్యాలయం కల్లూరు, ఆర్టీవో, లేబర్ ఇన్సూరెన్సు పోలీసుశాఖ ఏసీపీ కార్యాలయం సత్తుపల్లికి మార్చారు. సర్కిల్ కార్యాలయం వీఎంబంజరానికి మార్చడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. 60కి.మీ. దూరం సత్తుపల్లికిమార్చడం వల్ల ఏదైన పనిమీద వెళ్లాలంటే దూరాభారంతో పాటు ప్రయాణఖర్చులు ఎక్కువ అవుతున్నాయి. ఒకటికిరెండుసార్లు పోయిరావడం తీవ్ర అసౌకర్యంగా ఉంటుంది. భూసమస్యలు, పోలీసుకేసులు, వాహనాల రిజిస్ట్రేషన్లు, లైసెన్సులు తదిరత పనులపై నిత్యం ప్రజలు వెళ్లాల్సి వస్తుంది. దీంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయమై గతంలో ప్రజా సంఘాలు పెద్దఎత్తున ఆందోళనలు చేసినా ప్రభుత్వం పెడచెవిన పెట్టింది. రాజకీయంగా ఏన్కూరు మండలం వైరా నియోజకవర్గంలో ఉంది. అలాంటి మండలాన్ని వైరా ప్రాంతాన్ని వదిలి సుదూర ప్రాంతమైన సత్తుపల్లి, వీఎంబంజరకు కేటాయించడం పట్ల ప్రజలు అసహనం వ్యక్తంచేస్తున్నారు. ఉన్నతాదికారులు స్పందించి కార్యలయాలను వైరాకు మార్చి అందుబాటులోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

మురళీ నాయక్‌కు కొవ్వొత్తులతో నివాళి



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఐ, ఆటో డ్రైవర్లు

బోనకల్, మే 13 (ఆంధ్రజ్యోతి): దేశం కోసం ప్రాణాలర్పించిన వీరజవాన్ మురళీ నాయక్‌కు నివాళులర్పిస్తూ మంగళవారం స్థానిక ఖమ్మం బస్టాండ్ సెంటర్లో ఆటో యూనియన్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ పొదిలి వెంకన్న మాట్లాడుతూ.. దేశం కోసం అసువులు బాసిన మురళీ నాయక్ చిన్న వయస్సులోనే ప్రాణాలు త్యజించి గొప్ప దేశభక్తుడిగా మిగిలారని కొనియాడారు. వీర మరణం పొంది ప్రజల మనస్సుల్లో చిరస్థాయిగా నిలిచారని ప్రశంసించారు. ఆయన కుటుంబానికి మాత్రం ఇదో తీరని లోటుగా అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు మోదుగు సుదాకర్, ప్రదీప్, డేవిడ్ ప్రబాకర్, జ్వాల, బాబా మౌలాలి, గౌస్ తదితరులు పాల్గొన్నారు.